

# సంకు అప్పారావు

## శత జయంతి విశేష సంచిక

**తొలితరం కమ్యూనిస్టు - అలుపెరుగని రైతు ఉద్యమ నేత**

# తెలుగునాట వికసించిన ఎర్రపుష్పాలకివే జోహార్లు


[illegible]


[illegible]


[illegible]


[illegible]


[illegible]


[illegible]


[illegible]


[illegible]


[illegible]


[illegible]


మఖ్దూం మొహియుద్దీన్


[illegible]


[illegible]


[illegible]


[illegible]


[illegible]


[illegible]


[illegible]


[illegible]


ఎస్. వి. కె. ప్రసాద్


[illegible]



తరిమెల నాగిరెడ్డి


[illegible]


[illegible]


[illegible]

తొలితరం కమ్యూనిస్టు - అలుపెరుగని రైతు ఉద్యమ నేత

# సంకు అప్పారావు

శత జయంతి విశేష సంచిక

సంకలనం

డి వి వి యస్ వర్మ



# మా మాట

## అసంపూర్ణ సంచిక

సంకు అప్పారావు గారి శత జయంతి విశేష సంచిక **6-7** సంవత్సరాలకు ముందే తీసుకురావాలని భావించాం. ఆయన రాసిన వ్యాసాలు, నడిపిన ఉద్యమాల సమాచారాన్ని సేకరించలేకపోయాం. ఇప్పుడు కొన్ని అడుగులు పడుతున్నాయి. త్వరలోనే మరికొంత సమాచారాన్ని సేకరించి అప్పారావు గారి **107**వ జయంతి **(2024** జూన్ **16)** నాటికి ఈ సంచికను మరింత సమగ్రంగా రూపొందించి విడుదల చేస్తాము.

**1)** కుటుంబ సభ్యుల జ్ఞాపకాలు

**2)** సారథ్యం వహించిన రైతు ఉద్యమాలు

**3)** కమ్యూనిస్టు పార్టీలో నిర్వహించిన పాత్ర

**4)** సహచరులు, మిత్రుల ఆప్త వాక్యాలు

ఇలాంటి సమాచారం సేకరిస్తున్నాము.

**2024** జూన్‌లో పూర్తి సంచికను విడుదల చేస్తాము.

సంకు మనోరమ,

మరియు కుటుంబ సభ్యులు

# విషయ సూచిక

1. స్వాతంత్ర్య సమరయోధులు, తొలితరం కమ్యూనిస్టు నాయకులు, రాష్ట్ర రైతు సంఘ నాయకులు

2. సంకు అప్పారావు స్మృతి చిహ్నాలు

3. స్వీయ రచనలు : పశ్చిమ గోదావరి జిల్లాలో జమీందారీ వ్యతిరేక పోరాటాలు

4. స్వీయ రచనలు : పశ్చిమ గోదావరి జిల్లా రైతు ఉద్యమ చరిత్ర

5. స్వీయ రచనలు : బెల్లం రైతుల దుస్థితి

6. కమ్యూనిస్టు ఉద్యమంలో సంకు అప్పారావు

# సంకు అప్పారావు

జీవన రేఖలు

**స్వాతంత్ర్య సమరయోధులు, తొలితరం కమ్యూనిస్టు నాయకులు, రాష్ట్ర రైతు సంఘ నాయకులు**

కామ్రేడ్ సంకు అప్పారావు 1917లో జూన్ 16వ తేదీ భీమవరం తాలూకా కొండేపాడు గ్రామంలో జన్మించారు. తుది శ్వాస వరకు ఆయన తన జీవితాన్ని రైతుల కోసం శ్రామిక రాజ్యం సాధన కోసం అంకితం చేశారు. 1992 మే 29న ఏలూరులో తన స్వగృహంలో మరణించారు.

**చదువు**

- తణుకు హైస్కూల్‌లో చదువుకున్నారు.
- అక్కడే చదువుతున్న చింతలపాటి వరప్రసాదమూర్తిరాజు, ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్, దూసనపూడి విరాటరాజు గార్లు సహాధ్యాయులుగా వున్నారు. తదనంతర కాలంలో వారు ఏ ఏ పార్టీలలో వున్నా వారి స్నేహం నిరంతరాయంగా కొనసాగింది. అప్పారావు విద్యార్థి, యువజన ఉద్యమాల్లో క్రియాశీల పాత్ర పోషించారు.

**కొన్ని ముఖ్య ఘట్టాలు**

- పశ్చిమ గోదావరి జిల్లా తొలి తరం కమ్యూనిస్టులలో ఆయన ఒకరు. 1937లోనే పార్టీ సభ్యత్వం పొందారు.
- కమ్యూనిస్టు పార్టీని బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించినందున కాంగ్రెస్‌లో భాగంగా కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో చేరి పనిచేశారు.

**కొత్తపట్నం రాజకీయ పాఠశాల**

- 1937 మేలో ఆ నాటి గుంటూరు జిల్లా కొత్తపట్నంలో జరిగిన తొలి రాజకీయ పాఠశాలలో పాల్గొన్నారు.
- మధ్యలోనే ప్రభుత్వం ఆ పాఠశాలను నిషేధించి పోలీసులతో దాడి చేయించి దొరికిన వారిని దొరికినట్టు అరెస్టు చేయించింది. అప్పారావును అరెస్టు చేసి ఒంగోలు, తెనాలి సబ్ జైళ్ళలో నిర్బంధించారు. ఆ సందర్భంలో ఆయన పోలీసుల చిత్రహింసలకు గురయ్యారు.

**చారిత్రాత్మక రైతు రక్షణయాత్ర**

- 1937లో చారిత్రాత్మకమైన రైతు యాత్ర జరిగింది. రాష్ట్ర రైతు నాయకులు కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి, చలసాని వాసుదేవరావు గార్ల నాయకత్వాన ఇచ్ఛాపురం నుండి తడ వరకు సాగినప్పుడు జిల్లాలో ఆ మూల నుండి ఈ మూల వరకు వందలాది గ్రామాలలో రైతు సంఘం గురించి, జమిందారీ వ్యతిరేక పోరాటాల గురించి ప్రచారం చేశారు. జిల్లాలో ఈ యాత్ర జయప్రదం కావడంలో అప్పారావు ముఖ్య పాత్ర పోషించారు.



**జమీందారీ వ్యతిరేక పోరాటాలు**

- 1939లో చరిత్ర ప్రసిద్ధమైన కాళీపట్నం జమీందారీ వ్యతిరేక పోరాటం జరిగింది. నర్సాపురం తాలూకా కాళీ పట్నం గ్రామంలో జమీందారు రైతులను దగా చేసి 7,500 ఎకరాలకు తన స్వంత భూమి అని చెప్పి అమ్మకం పెట్టాడు. పోలీసులను పెట్టుకొని 144 సెక్షన్ పెట్టించి రైతులను బెదిరించి లొంగ దీయడానికి ప్రయత్నించాడు. రైతు నాయకులు సంకు అప్పారావు, గొట్టుముక్కల వెంకట్రామ రాజు, కృత్తివెంటి వెంకటేశ్వరరావు, కాళీపట్నం వెళ్లి మొత్తం




రిపోర్టు సేకరించి నర్సాపురం తాలూకా రైతు సంఘానికి నివేదిక సమర్పించారు. దీనిపై సత్యాగ్రహ పోరాటం జరపాలని తాలూకా కాంగ్రెస్ నిర్ణయించింది. 1939 మార్చి ఏడో తేదీన సత్యాగ్రహం ప్రారంభమైంది. కాంగ్రెస్ వారు, కమ్యూనిస్టులు, రైతులు, స్త్రీలు, పురుషులు వందలాది మంది సత్యాగ్రహంలో పాల్గొన్నారు.

- సంకు అప్పారావు కాళీపట్నం జమీందారీ భూములను సాగు చేసుకుంటున్న రైతులను పోలీసులతో బలవంతంగా తొలగించడాన్ని ప్రతిఘటిస్తూ సాగిన రైతు సత్యాగ్రహం తొలి బృందానికి సంకు అప్పారావు నాయకత్వం వహించి అరెస్టు అయ్యారు.
- 1943-44లో జరిగిన కలవలపల్లి-సూరాపురం జమీందారీ రైతుల పోరాటంలో, గోపాలపురం జమీందారీ వ్యతిరేక పోరాటంలో, కానూరు, పెండ్యాల లంక రైతుల పోరాటంలో అప్పారావు ప్రముఖ పాత్ర పోషించారు.

## రహస్య జీవితం

- 1940-52 మధ్యకాలంలో ఆయనపై అరెస్టు వారెంటు వున్నందున పోలీసులకు చిక్కకుండా పది సంవత్సరాల ఆరు నెలలపాటు రహస్య జీవితం గడిపారు. రహస్య జీవిత కాలంలోను పార్టీ జిల్లా కార్యదర్శి బాధ్యతలు నిర్వహించారు.
- అప్పారావును ఎలాగైనా పట్టుకోవాలని పోలీసులు కొండేపాడు గ్రామంపై పలుమార్లు దాడులు చేశారు. అయన పొలంలోని పైరును కోసుకుపోయారు. ఆచూకీ చెప్పమని 70 ఏళ్ల ముదుసలి తండ్రిని కొట్టారు. ఇంటిలోని సామగ్రిని ధ్వంసం చేశారు. సంకు అప్పారావు భార్య లక్ష్మీ కాంతం గారిని ఆరు నెలలపాటు పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారు.

## ఎన్నికలు

- 1952 ఎన్నికలలో పోలవరం నుండి పోటీ చేసి కేవలం 450 ఓట్ల తేడాతో ఓడిపోయారు.
- ఉభయ గోదావరి జిల్లాల స్థానిక సంస్థల అభ్యర్థిగా శాసన మండలికి ఎన్నికయ్యారు.
- అత్తిలి, ఏలూరు అసెంబ్లీ స్థానాలకు జరిగిన వివిధ ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థిగా పోటీ చేశారు.

## ఇతర ఉద్యమాలు

- సంకు అప్పారావు నిరంతర పోరాటయోధుడు.
- 1970 దశకంలో గోదావరి బ్యారేజీ నిర్మాణానికి సాగిన ఉద్యమాన్ని ప్రభుత్వ హామీ లభించే వరకూ రైతులను సమీకరించి ఆందోళన సాగించారు.
- పోలవరం ప్రాజెక్టు సాధనకు సాగిన అన్ని ఉద్యమాలలో ప్రముఖ పాత్రధారిగా ఉన్నారు.
- రాష్ట్రంలో, జిల్లాలో జరిగిన అనేక రైతు పోరాటాలకు ఆయన తన జీవితాన్ని అంకితం చేశారు.
- 1992 మే 29వ తేదీన ఏలూరులోని తన స్వగృహంలో మరణించారు. ❑



కుమార్తెలు సుజాత, సూర్యకుమారి, మనోరమ, మనుమరాలు కవితలతో సంకు అప్పారావు దంపతులు



సంకు విజయకుమార్



సంకు రవి

# సంకు అప్పారావు స్మృతి చిహ్నాలు




ఏలూరులో సంకు అప్పారావు విగ్రహం.. నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు




తూర్పు విప్పర్రులో సంకు అప్పారావు భవనం.. సీపీఐ కార్యాలయం

# పశ్చిమ గోదావరి జిల్లాలో జమీందారీ వ్యతిరేక పోరాటాలు

స్వీయ రచనలు

- సంకు అప్పారావు



జాతీయ పోరాటాలలో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లాలో రైతాంగ ఉద్యమం ప్రారంభమైంది. 1923లో జిల్లా కాంగ్రెసు ప్రముఖులు కీ.శే. దండు నారాయణరాజు గారి నాయకత్వాన జిల్లా రైతు సంఘం స్థాపించబడింది. 1930లో వచ్చిన ఆర్థిక సంక్షోభం వల్ల 1929లో రూ.6.25 ఉన్న ధాన్యం బస్తా రేటు రెండు నుంచి మూడు రూపాయల 25 పైసలకు పడిపోయింది. దీనితో భూముల ధరలు పడిపోయి, రుణభారం, పన్నుల భారం పెరిగి రైతులు తీవ్ర దుస్థితిలో పడిపోయారు. వడ్డీ వ్యాపారులు రైతులను ఘోరంగా దోపిడీ చేశారు. వేల కొద్దీ రైతాంగం దివాళా తీశారు. వారి భూములు కారుచౌకగా వడ్డీ వ్యాపారులు స్వాధీనం చేసుకున్నారు.

### మారటోరియం కోసం తీవ్రాందోళన

ఈ పరిస్థితుల్లో మారటోరియం(రుణ విముక్తి) ప్రకటించాలనీ, భూముల పూర్వపు ధరలను అనుసరించి వాయిదాల వారీగా రుణదాతలు రుణ పరిష్కారం కావించుకోవాలని, ల్యాండ్ మార్టిగేజ్ బ్యాంకుల ద్వారాను, సహకార పరపతి సంఘాల ద్వారాను రైతులకు పరపతి సౌకర్యం విరివిగా కల్పించాలని, వడ్డీ రేటును బాగా తగ్గించాలని తాలూకా, జిల్లా సభలు పెట్టి పెద్దఎత్తున రైతు సంఘం ఆందోళనలు చేసింది. కాంగ్రెస్ నాయకులే గాక, జస్టిస్ పార్టీ నాయకులు లేళ్ల చిట్టబ్బాయి నాయుడు, బడేటి వెంకట్రామయ్యనాయుడు ఆందోళనలో పాల్గొన్నారు. "రైతు సంఘాలు ఎందుకు ?" అనే కరపత్రాన్ని కాంగ్రెస్ నాయకుడు శ్రీ మాగంటి బాపినీడు రాశారు.

### రీసెటిల్మెంటు వ్యతిరేక ఉద్యమం

1931లో రూపాయికి మూడు అణాలు పన్నుగా పెంచిన రీసెటిల్మెంటు రేటును ప్రభుత్వం అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నప్పుడు జిల్లాలో దండు నారాయణరాజు, కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి, మాగంటి బాపినీడు, వడ్లపట్ల గంగరాజు మొదలైన అనేక మంది తీవ్రమైన ఆందోళనలు చేస్తే ప్రభుత్వం వీరిని అరెస్టు చేసింది. రైతాంగం గావించిన ఈ ఆందోళన ఫలితంగా రీసెటిల్‌మెంటు విధింపు వాయిదా వేసుకున్నారు. ఇది 1944లో కాని అమలులోకి రాలేదు.

### గిరిజనుల భూమి పోరాటం

1935లో పోలవరానికి ఎగువన తొమ్మిది మైళ్ల దూరంలో గోదావరి ఒడ్డునున్న కోండ్రుకోటలో గిరిజన రైతుల భూములను ఫారెస్టు కాంట్రాక్టర్లు 400 ఎకరాల వరకు కాజేశారు. దట్టమైన అటవీ ప్రాంతం అది. రైతు సంఘం లేదు. అయినప్పటికీ అక్రమ, అమానుష దోపిడీ పద్ధతులలో తమ భూములను కాజేసినందుకు గిరిజన రైతులు కోండ్రుకోట మునసబు పూనెం చలమయ్యదొర నాయకత్వాన కోండ్రుకోట, వాడపల్లి, తల్లడం గ్రామాల రైతులు విల్లంబులు, బరిశెలు, కత్తులు మొదలైన ఆయుధాలు తీసుకొని భూములలో నాగళ్లు కట్టి గిరిజనేతర దోపిడీదారులను బయటకు పారద్రోలారు. అప్పటి జిల్లా కలెక్టర్ వచ్చి ఎక్కువ భూములు గిరిజనులకు ఇప్పించి, కొద్ది భూములు గిరిజనేతరులకు ఇప్పించి రాజీ చేశారు. కాని, తిరిగి ఆ ప్రాంతం భూములు గిరిజనేతరులు ఆక్రమించగా కోయ రైతాంగం వాటి కోసం ఆందోళన చేస్తూ ఉన్నారు.

### సంఘటిత రైతు ఉద్యమం

1935లో జిల్లా రైతు సంఘం, అనేక గ్రామాలలో రైతు సంఘాలు ఏర్పడ్డాయి. కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి అధ్యక్షులుగా, కలిదిండి సుబ్రహ్మణ్యం గారు కార్యదర్శిగా, మాగంటి బాపినీడు సహాయ కార్యదర్శిగా, దండు నారాయణ రాజు, వడ్లపట్ల గంగరాజు, అల్లూరి సత్యనారాయణరాజు, గారపాటి సత్యనారాయణ మున్నగువారు కార్యవర్గ సభ్యులుగా జిల్లా రైతు సంఘం ఏర్పడింది. కాంగ్రెస్, కమ్యూనిస్టు నాయకులు సమైక్యంగా రైతు ఉద్యమాన్ని నడిపారు. ఆ తరువాత ఈ సమైక్య సంఘటిత రైతు ఉద్యమం కాళీపట్నం మొదలగు అనేక జమీందారీ వ్యతిరేక పోరాటాలను నడిపింది.

### చారిత్రాత్మక రైతు రక్షణయాత్ర

1937లో చారిత్రాత్మకమైన రైతు యాత్ర, రాష్ట్ర రైతు నాయకులు కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి, చలసాని వాసుదేవరావు గార్ల నాయకత్వాన ఇచ్ఛాపురం నుండి తడ వరకు సాగినప్పుడు జిల్లాలో ఆ మూల నుండి ఈ మూల వరకు వందల గ్రామాలలో రైతు సంఘం గురించి, జమిందారీ వ్యతిరేక పోరాటాల గురించి రైతు సంఘం ప్రచారం గావించింది. ఈ యాత్ర జిల్లా రైతాంగంలో గొప్ప ఉద్యమ చైతన్యాన్ని కలుగజేసింది.

### ఋణ నివారణ చట్టం

1937 ఎన్నికల అనంతరం మద్రాసులో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మంత్రి వర్గం. ఋణ పరిష్కార బిల్లు తయారు చేయడానికి రెవెన్యూ మంత్రి టంగుటూరి ప్రకాశం ఆధ్వర్యాన కమిటీ వేసింది. ఈ బిల్లును బలపరుస్తూ అన్ని తాలూకాలలోను, అనేక గ్రామాలలో సభలు జరుపబడ్డాయి. చింతలపూడిలో మూడు వేల మంది రైతులు శ్రీ గారపాటి సత్యనారాయణ, శ్రీ పేకేటి వెంకటరత్నం గార్ల నాయకత్వాన ఎర్రజండాలతో, రైతు గేయాలతో బ్రహ్మాండమైన రైతు ప్రదర్శన జరిపారు. జీలకర్ర గూడెం, బోగోలు, ఉప్పుగూడెం, మొఖాసా రైతు పోరాటాలు, మొఖాసా జమీందార్ల దురన్యాయాలను ఎదిరించుతూ రైతు సంఘ నాయకత్వాన పోరాటాలు నిర్వహించబడినాయి.

### గంగోలు ఎస్టేటు జమీందారీ వ్యతిరేక పోరాటం


9-12-1938 తేదీన ఏజెన్సీ పోలవరం తాలూకా రైతు మహాసభ రాజుపాలెంలో శ్రీ రెబ్బాప్రగడ మందేశ్వరశర్మ గారి అధ్యక్షతన జరిగింది. హుకుంపేట జమీందారు (గంగోలు ఎస్టేటు జమీందారు) ఈ సభ జరగకుండా చేయడానికి అనేక ఆటంకాలు కల్పించారు. అయినప్పటికీ వెయ్యి మంది కోయ రైతులు సభకు హాజరయ్యారు. జమీందారీల రద్దు ఆవశ్యకత గురించి జమీందారీ కమిటీ రిపోర్టు బలపరుస్తూ శ్రీ మందేశ్వర శర్మ,, పుసులూరి కోదండరామయ్య, ఇనుగంటి నారాయణ రావు, కొర్రపాటి పట్టాభిరామయ్య, ముదుంబై వెంకటరంగాచార్యులు మున్నగువారు మాట్లాడారు. ఈ ఆందోళన ఫలితంగా రాజుపాలెం రైతాంగం జమీందారులకు వ్యతిరేకంగా పోరాడి భూములు సంపాదించుకున్నారు. గోపవరం రైతులు బహు తక్కువ ఖరీదుకు జమీందారు నుండి భూములు కొనుక్కున్నారు. దీపం ఉండగానే ఇల్లు చక్క బెట్టుకుందామనే ఉద్దేశంతో హుకుంపేట జమీందారు రాంపాలెం, హుకుంపేట, సాగిపాడు, లక్ష్మీనారాయణదేవిపేట, బుచ్చంపాలెం, రైతులను భూముల నుండి రైతులను వెళ్లగొట్టి స్వాధీనం మచేసుకున్నాడు. (దాదాపు 3 వేల ఎకరాలు) సొంత సేద్యం పెట్టి దీనిని దక్కించుకున్నాడు. ఈ భూములే కాకుండా కోయగ్రామాలు పాతకుంకాల, కొత్త కుంకాల, రెడ్డి కుంకాల, పేద్రాల, జిల్లేళ్లగూడెంలలో కోయ రైతులను వెళ్లగొట్టి 570 ఎకరాలు స్వాధీనం చేసుకున్నాడు. పోలవరంలో జరిగిన రైతు మహాసభలో చైతన్యం పొందిన గిరిజనులు జమీందారుకు వ్యతిరేకంగా గొప్ప పోరాటం జరిపారు. జమీందారు మనుషులను తోలివేసి కోయలు నాగళ్లు కట్టి భూములు దున్నుతుండగా, జమీందారు తన సిబ్బందిని వెంటబెట్టుకుని ఏనుగుతో రైతుల మీద దాడి చేశాడు. గిరిజనులు, విల్లంబులు తీసుకొని ఏనుగు మీద బాణాలు వేయగా అది అడవులకు అడ్డంపడి కొండలలోకి పారిపోయింది. జమీందారు సిబ్బంది కూడా పారిపోయారు తరువాత ఏనుగును పట్టుకొని జమీందారు హుకుంపేటకు తీసుకొని రాగా బాణం దెబ్బలకు ఏనుగు చచ్చిపోయింది. జమీందారు కోయలను కోర్టుకు లాగారు. కోయలు పెట్టుకున్న లాయర్‌ను జమీందారు డబ్బుతో కొనివేసి, కోర్టులు, పోలీసులు ద్వారా భూములను వశపరచుకు న్నాడు. ఈ పోరాటం ఆ ప్రాంతంలోని కోయరైతులలో పెద్ద చైతన్యం కల్గించింది.

**కోయలు నాగళ్లు కట్టి భూములు దున్నుతుండగా, జమీందారు తన సిబ్బందిని వెంటబెట్టుకుని ఏనుగుతో రైతుల మీద దాడి చేశాడు. గిరిజనులు, విల్లంబులు తీసుకొని ఏనుగు మీద బాణాలు వేయగా అది అడవులకు అడ్డంపడి కొండలలోకి పారిపోయింది. జమీందారు సిబ్బంది పారిపోయారు తరువాత ఏనుగును పట్టుకొని జమీందారు హుకుం పేటకు తీసుకొని రాగా బాణం దెబ్బలకు ఏనుగు చచ్చిపోయింది.**

### చరిత్రాత్మకమైన కాళీపట్నం పోరాటం

ఇదే సమయములో(1939) చరిత్ర ప్రసిద్ధమైన కాళీపట్నం జమీందారీ వ్యతిరేక పోరాటం జరిగింది. నర్సాపురం తాలూకా కాళీపట్నం గ్రామంలో జమీందారు, రైతులను దగా చేసి 7,500 ఎకరాలకు తన స్వంత భూమి అని చెప్పి అమ్మకం పెట్టాడు. పోలీసులను పెట్టుకొని 144 సెక్షన్ పెట్టించి రైతులను బెదిరించి లొంగదీయడానికి ప్రయత్నించాడు. రైతు నాయకులు శ్రీ సంకు అప్పారావు, గొట్టుముక్కల వెంకట్రామరాజు, కృత్తివెంటి వెంకటేశ్వరరావు, కాళీపట్నం వెళ్లి మొత్తం రిపోర్టు సేకరించి నర్సాపురం తాలూకా రైతు సంఘానికి నివేదిక సమర్పించారు. ఇందుపై సత్యాగ్రహ పోరాటం జరపాలని తాలూకా కాంగ్రెస్ నిర్ణయించింది. 7-3-39న సత్యాగ్రహం ప్రారంభమైంది. కాంగ్రెస్ వారు, కమ్యూనిస్టులు, రైతులు, స్త్రీలు, పురుషులు వందలాది మంది సత్యాగ్రహంలో పాల్గొన్నారు. సంకు అప్పారావు, భూపతిరాజు లక్ష్మీనరసింహరాజు, శ్రీమతులు మాణిక్యాంబ, అల్లూరి అన్నపూర్ణ మొదలైన వారు నాయకత్వం వహించి సత్యాగ్రహ దళాలను నడిపించారు. రాష్ట్ర రైతు సంఘాధ్యక్షులు కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తిగారు కాళీపట్నం పోరాటాన్ని బలపరుస్తూ ప్రకటన ఇచ్చారు. రాష్ట్ర మంతటా సభలు జరిగాయి.

కాళీపట్నం దినోత్సవాన్ని జరపాలని కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ తీర్మానించింది. అఖిల భారత్ రైతుసంఘ అధ్యక్షులు స్వామి సహజానంద సరస్వతి, ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ రంగా, సంయుక్త కార్యదర్శులు ఇందూలాల్ యాగ్నిక్, అవధేశ్వర ప్రసాద్‌సిన్హా, ఈ అయిదుగురు పోలీసుల నిర్బంధ కాండను



చారిత్రాత్మక కాళీపట్నం రైతాంగ పోరాటం (1937)

ఖండిస్తూ, కాళీపట్నం పోరాటాన్ని బలపరిచారు. శాసనసభ్యులు శ్రీ దండు నారాయణరాజు, గొట్టుముక్కల వెంకన్న గార్లు భూముల మీద హక్కు రైతులదేనని, రెవెన్యూ మంత్రి ప్రకాశం గారు కాశీపట్నం వచ్చినప్పుడు మెమొరాండం యిచ్చారు. ఈ విధంగా కాళీపట్నం రైతు పోరాటాన్ని జిల్లాలోని బలమైన కాంగ్రెస్ వర్గం బలపరిచింది.

ఈ పోరాటం జిల్లాలోని రైతాంగంలో గొప్ప సంచలనం తెచ్చింది. యువకులలో ఉత్సాహాన్ని కలుగజేసింది. రెవెన్యూ మంత్రి ప్రకాశం గారు స్వయంగా కాళీపట్నం వచ్చి రైతుల హక్కులు న్యాయమైనవేనని అంగీకరించారు. సబ్ జైళ్లలోని వారందరినీ విడుదల చేశారు. ఈలోగా రెండవ ప్రపంచయుద్ధం వచ్చింది. కాంగ్రెస్ మంత్రి వర్గం రాజీనామా ఇచ్చింది. ఈ పరిస్థితుల మూలంగా రైతుల హక్కులు పూర్తిగా నెరవేరలేదు.

### బ్రిటిష్ నిర్బంధ విధానం - అరెస్టులు

రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభం కావడంతో, కాంగ్రెస్ మంత్రి వర్గాల రాజీనామాలతో బ్రిటిష్ ప్రభుత్వ నిర్బంధ విధానం ప్రారంభమైంది. జిల్లాలో రైతు నాయకులు అందరిపైన దాడి ప్రారంభమైంది. అల్లూరి సత్యనారాయణరాజు, గారపాటి సత్యనారాయణ, పేటేటి వెంకటరత్నం, కలిదిండి బంగారురాజు, భూపతిరాజు లక్ష్మీనరసింహరాజు, ఉద్దరాజు సూరపరాజు, తనికెళ్ల వెంకటచలపతి, కృత్తివెంటి వెంకటేశ్వరరావు అన్నే వెంకటేశ్వరరావు, వంకినేని సత్యనారాయణ, కలిదిండి సూర్య నారాయణరాజు, ఎస్.ఆనందరావు, గొట్టుముక్కల వెంకట్రామ రాజు ఇంకా అనేక మంది రైతు సేవకులు ఇంటర్న్‌మెంట్లు, డిటెన్షన్లు, దీర్ఘశిక్షలకు గురయ్యారు. మృత్యుంజయుడు, ఉద్ధరాజు రామం, సంకు అప్పారావు, దాట్ల సూర్యనారాయణ రాజు ప్రభుత్వానికి పట్టుబడకుండా రహస్యంగా ఉండి పని చేశారు. జిల్లా రైతు నాయకులలో ముఖ్యులైన కలిదిండి సుబ్రహ్మణ్యంగారు తీవ్ర అనారోగ్యం వలన చికిత్సకు వెళ్లారు. జిల్లా రైతు ఉద్యమానికి, రాష్ట్ర రైతు ఉద్యమానికి పట్టుగొమ్మ అయిన కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి గారు చనిపోయారు. ప్రభుత్వ నిర్బంధ విధానంతోబాటు, వీరిద్దరూ లేకపోవడం వలన రైతు ఉద్యమానికి తీవ్రనష్టం కల్గింది. 1942లో జాతీయోద్యమంలో కాంగ్రెస్ వాదులకు కమ్యూనిస్టులకు వచ్చిన విభేదాల వలన రైతు ఉద్యమంలో చీలికలు వచ్చాయి. 1943–44 మధ్య కలవలపల్లి–సూరాపురం జమీందారీ రైతుల పోరాటం కామ్రేడ్స్ మద్దుకూరి నారాయణ, ముళ్లపూడి పుల్లయ్య, ముళ్లపూడి కృష్ణారావు నాయకత్వాన జరిగింది. కానూరు – పెండ్యాలలంక రైతుల పోరాటం కామ్రేడ్స్ దేవరకొండ సుబ్బారావు, ఈద్పుగంటి పూర్ణచంద్రరావు, పరకాల పట్టాభి రామారావు, మృత్యుంజయుడు, ఎస్.ఆర్.దాట్ల, అన్నే వెంకటేశ్వరరావు, సంకు అప్పారావు, ఉద్దంరాజు రామంగార్ల నాయకత్వంలో సుదీర్ఘకాలం సాగింది. 1949–50 నిర్బంధ కాలంలో 22 సార్లు పెండ్యాల గ్రామం మీద పోలీసు దాడులు జరిగాయి. కామ్రేడ్స్ దేవరకొండ సుబ్బారావును పోలీసులు కాల్చి చంపారు. పూర్ణచంద్రరావు కొట్టి చంపారు.

కొవ్వూరు తాలూకా గోపాలపురం జమీందారీ వ్యతిరేక పోరాటం 1946–47లో జరిగింది. సంజీవపురం, బుచ్చంపేట కోయకరిచర్లగూడెం, నందిగూడెం గ్రామాల రైతులు భూములకై పోరాటం సాగించారు. బుచ్చంపేట కోయరైతులు భూములు దున్ని పంట కోసుకొనే సమయంలో జమీందారు రిజర్వు పోలీసులు తెచ్చి స్టెన్ గన్‌లతో కాల్పులు జరిపించాడు. ముగ్గురు కోయ రైతులు మరణించారు. ఒకరు అంగ వైకల్యం చెందారు. కాంగ్రెస్, కమ్యూనిస్టు నాయకులు రైతుల తరపున నిలబడి పోరాడారు. చింతలపూడి తాలూకా పోతునూరు రైతుల జమీందారీ వ్యతిరేక పోరాటం(1946–49) పోలవరం తాలూకా తల్లవరం కోయ రైతుల పోరాటం పేర్కొనదగినవి. ❑

# పశ్చిమ గోదావరి జిల్లా రైతు ఉద్యమ చరిత్ర

స్వీయ రచనలు

- సంకు అప్పారావు



పశ్చిమ గోదావరి జిల్లాలో రైతు సంఘం సుప్రసిద్ధ దేశభక్తులు అప్పటి జిల్లా కాంగ్రెస్ నాయకులగు కీర్తిశేషులు దండు నారాయణరాజు గారిచే 1923లో స్థాపించబడినది. 1923 నుండి 29 వరకు ఆయనే జిల్లా రైతు సంఘానికి అధ్యక్షులుగా గాని కార్యదర్శిగా గాని వుండి పనిచేశారు. అప్పటిలో మన రాష్ట్రమునందు ఈ జిల్లా నాయకులే రైతు సమస్యలను చేపట్టుటలో ముందడుగు వేశారు. ఆ రోజులలో రైతు సమస్యలను బాగా అర్థం చేసుకొని సమర్థతగా రైతుసేవ చేయుటకు ఒక రైతాంగ విద్యాలయం జిల్లాలో నడుపబడింది. శ్రీ దండు నారాయణరాజు గారు, రెబ్బాప్రగడ మందేశ్వరశర్మ, మాగంటి బాపినీడు గార్లు దీనిని నడిపారు. ప్రథమమైన ఇట్లాంటి రైతాంగ విద్యాలయాన్ని నిర్వహించినది కూడా పశ్చిమ గోదావరి జిల్లాయే.

1930 సంవత్సరంలో వచ్చిన ఆర్థిక సంక్షోభం వలన 1929లో రూ.6.25 వున్న ధాన్యం బస్తా రేటు రూ.2.00 నుండి రూ.3.25కు పడిపోయింది. దీనితో భూముల ధరలు పడిపోయి ఋణభారం, పన్నుల భారం పెరిగి రైతులకు ప్రాణ సంకటమైనది. దీనికితోడు ప్రయివేటు వడ్డీ వ్యాపారులు రైతులను ఘోరంగా దోపిడీ చేసినారు. వేలకొలది రైతాంగము దివాలా తీసి భూములు కారు చౌకగా వడ్డీ వ్యాపారులకు పోగొట్టుకుంటూ అప్రతిష్టపాలయ్యారు. ఈ స్థితిలో మారటోరియం ప్రకటించాలని, భూముల పూర్వపు ధరల ననుసరించి వాయిదాల వారీగా ఋణదాతల ఋణపరిష్కారం కావించుకోవాలని లాండు మార్టిగేజి బ్యాంకుల ద్వారానూ, కో-ఆపరేటివ్ క్రెడిట్ బ్యాంకుల ద్వారానూ పరపతి సౌకర్యం విరివిగా రైతులకు కలిగించాలని, వడ్డీరేటును బాగా తగ్గించాలని తాలూకా జిల్లా సభలు పెట్టి పెద్దయెత్తున రైతుసంఘం ఆందోళన చేయడం జరిగింది. దీనికి కాంగ్రెస్ నాయకులే గాక కళ్ళీ చిట్టబ్బాయినాయుడు, బడేటి వెంకట్రామయ్యానాయుడు మున్నగు జస్టిస్ పార్టీ నాయకులు కూడా కలిసి వచ్చారు. 'ఇల్లు కాలుతుంటే నుయ్యి త్రవ్వినట్లుగా, అంతా నెత్తిపైకి వచ్చాక తత్తర పడటం కాదు. నిరంతరం రైతుల కష్టనష్టాలను గమనించి పాటుపడుటకు నిర్మాణాత్మకమైన గ్రామ సంఘాలుండా"లని కళ్ళీ చిట్టబ్బాయి తమ వుపన్యాసాలలో చెపుతుండేవారు. రైతు




**ఫొటోలు : ఆచార్య వకుళాభరణం రామకృష్ణ గారి 'చరిత్రాత్మక రైతు రక్షణ యాత్ర పుస్తకం నుంచి**

సంఘముల ఆవశ్యకతను వివరిస్తూ మాగంటి బాపినీడుగారు 'రైతు సంఘాలెందుకు' అను కరపత్రాన్ని వ్రాశారు.

- 1931లో రూపాయకు మూడుఅణాలు పన్నుగా పెంచిన రీ సెటిల్‌మెంటు రేటును ప్రభుత్వం అమలు జరుపబోయిన పుడు ఈ జిల్లాలో దండు నారాయణరాజు, కొమ్మారెడ్డి సత్య నారాయణమూర్తి, మాగంటి బాపినీడు, వడ్లపట్ల గంగరాజు మున్నగు అనేక మంది తీవ్ర ఆందోళన చేస్తే ప్రభుత్వం అరెస్టు చేసింది. పైనాయకుల కృషికి దోహదమిస్తూ రైతాంగం గావించిన ఆందోళన ఫలితంగా రీ సెటిల్‌మెంటు రేట్లు 1944 వరకు అమలులోకి రాలేదు.
- 1935 సంవత్సరం ప్రాంతంలో కోంద్రుకోట ప్రాంతంలో గిరిజనులు భూములు, అడవి కాంట్రాక్టుదారులైన పెంట పాటి పుల్లారావు వగైరా అక్రమ పద్ధతిలో 400 ఎకరాలు పైగా కాజేశారు. ఆ రోజులలో ఈ ప్రాంతం దట్టమైన అడవు లతో నిండిన ఏజెన్సీ ప్రాంతం. పోలవరానికి పైభాగాన తొమ్మిది మైళ్ళలో గోదావరికి ఆనుకొని కోంద్రుకోట యున్నది. గిరిజనరైతుల భూములను అక్రమంగా అమాను షంగా, దోపిడీ పద్ధతులలో కాజేయడం గిరిజనులు సహించ లేకపోయారు. ఆ రోజులలో యిక్కడ రైతుసంఘం అనేది లేదు. అయినప్పటికి కోంద్రుకోట, మునసబు పూనెం చలమయ్య దొర నాయకత్వాన మాదాపురం, కోంద్రుకోట, తల్లవడం, వాడపల్లి గ్రామాల రైతులు విల్లంబులు, బరిశెలు, కత్తులు మొదలగు ఆయుధాలు తీసుకొని భూములలో నాగళ్ళు కట్టి గిరిజనేతర దోపిడీదారులను బయటకు పారదోలేరు. అప్పటి జిల్లా కలెక్టర్ వచ్చి ఎక్కువ భూములు గిరిజనులకిప్పించి కొద్ది భూములు మాత్రం గిరిజనేతరుల కుంచి రాజీచేశారు. కాని తిరిగి ఆ ప్రాంతాల భూములు గిరిజనేతరులు అక్రమంగా ఆక్రమించగా 1954 నుండి కోయరైతాంగం వాటి కోసం పిటిషనులు పెట్టుచున్నారు.
- 1935లో కీర్తిశేషులు కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి గారు మిగతా రైతు సేవకులు అందరివలె గ్రామ రైతు సంఘాల ఆవశ్యకతను గుర్తించుటేగాక వాటి నిర్మాణము నకు ప్రత్యేక శ్రద్ధ వహించి పాటుపడ్డారు. 1935 నాటికి అనేక గ్రామాలలో సంఘాలు ఏర్పడి జిల్లా రైతు సంఘం ఏర్పడింది. కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి గారు అధ్యక్షు లుగాను కామ్రేడ్ కలిదిండి సుబ్రహ్మణ్యం గారు కార్యదర్శి గాను, మాగంటి బాపినీడు సహాయ కార్యదర్శిగాను, దండు నారాయణరాజు, వడ్లపట్ల గంగరాజు కామ్రేడ్ అల్లూరి సత్యనారాయణరాజు, కామ్రేడ్ గారపాటి సత్యనారాయణ మున్నగువారు కార్యవర్గ సభ్యులు గాను ఎన్నుకోబడిరి. ఈ విధంగా ఈ జిల్లాలో రైతు ఉద్యమం సామ్రాజ్యవాద వ్యతిరేక స్వభావంతో కాంగ్రెసు, కమ్యూనిస్టు నాయకుల కృషితో ఏర్పడి కాళీపట్నం మొదలగు అనేక జమీందారీ వ్యతిరేక రైతాంగ పోరాటాలు నడిపి రైతాంగం యొక్క ఆర్థిక,




రాజకీయ, దైనందిన కోర్కెలకు పాటుపడింది. 1935 నుండి కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు వర్గ చైతన్యంతో సామ్రాజ్య వాద వ్యతిరేక పోరాట దృక్పథంతో కాంగ్రెసువాదులతో కలిసి రైతు సంఘాలను నిర్మాణం చేశారు.

- 1935, 36, 37 సంవత్సరాలలో కామ్రేడు కలిదిండి సుబ్ర హ్మణ్యం గారు కార్యదర్శిగా యుండిరి. మొత్తంమీద సంఘం యొక్క శైశవావస్థలో కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి గారు, కలిదిండి సుబ్రహ్మణ్యం గార్లు అహర్నిశలు సంఘసేవ చేయుటయే గాక, ఆర్థికంగా కూడా ఎంతో చేయూతనిచ్చి సంఘాన్ని ముందుకు తీసుకుపోయారు. 1937 శాసనసభ ఎన్నికలలో రైతుసంఘం, రైతు సేవకులు, జమీందారుల నెదిరించి కాంగ్రెస్‌కు బాసటగా నిలిచి సామ్రాజ్యవాద అనుకూలురగు జస్టిస్ పార్టీ, పీపుల్సు పార్టీలకు గొప్ప పరాజయాన్ని కలిగించారు. 1936లో పుగాకు చట్టానికి వ్యతిరేకంగా ఆందోళన చేశారు.
- 1937లో చరిత్రాత్మకమైన రైతుయాత్ర రాష్ట్ర రైతు నాయకులు కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి, చలసాని

వాసుదేవరావు గార్ల నాయకత్వాన యిచ్ఛాపురం నుండి మద్రాసుకు సాగినపుడు జిల్లాలో ఆ మూలనుండి ఈ మూలవరకు వందల గ్రామాలలో రైతుసంఘం గూర్చి జిల్లా రైతుసంఘం ప్రచారం చేసింది. ఈ యాత్ర జిల్లా రైతాంగంలో గొప్ప ఉత్సాహాన్ని, చైతన్యాన్ని కలుగచేసింది.

- 1938-1939 సంవత్సరాలలో వెలమాటు గోపాల కృష్ణయ్య గారు, భూపతి రాజులక్ష్మి నరసింహరాజు గార్లు అధ్యక్షులుగాను, కామ్రేడ్ పేటేటి వెంకటరత్నం గారు కార్యదర్శిగాను ఎన్నుకోబడ్డారు.
- ప్రకాశం కమిటీ బిల్లు ఋణపరిష్కార చట్టాన్ని బలపరుస్తూ అన్ని తాలూకాలలోనూ జిల్లా అంతటా అనేక గ్రామాలలో సభలు జరుపబడ్డాయి. మహజర్లు పంపబడ్డాయి. చింతల పూడిలో మూడు వేల మంది రైతులు కామ్రేడ్స్ గారపాటి, పేటేటి వెంకటరత్నం గార్ల నాయకత్వాన ఎర్రజెండాలతో రైతు గేయాలు పాడుతూ బ్రహ్మాండమైన రైతు ప్రదర్శన జరిపారు. యింతేగాదు, మొఖాసా, జమీందార్ల దుర న్యాయాలను ఎదిరిస్తూ పోరాటములు కూడా రైతుసంఘ నాయకత్వాన జరిగాయి. జీలకర్రగూడెం, బోగోలు, ఉప్పుగూడెం, ముఖాసా రైతుల పోరాటాలు సాగాయి.
- 9-12-1938వ తేదీన ఏజెన్సీ పోలవరం తాలూకా రైతు మహాసభ రాజంపాలెంలో రెబ్బాప్రగడ మందేశ్వర శర్మ గారి అధ్యక్షతన జరిగింది. హుకుంపేట జమీందారు (గంగోలి ఎస్టేటు జమీందారు) సభ జరుగకుండా సకల ప్రయత్నాలు చేశారు. హకుంపేటలో ఊరేగింపు జరిపిన నలుగురు ప్రచా రకులను అడ్డుకొని అరెస్టు చేశారు. ఈ గ్రామంలో వ్యవ సాయ కార్మికులు ప్రచారకులను కాఫీ ఇవ్వటానికి పొయ్యి మీద నీళ్ళు పెట్టితే జమీందారు అనుచరులు పొయ్యి ఆర్పే శారు. జమీందారు అల్లుడు బులుసు పాపయ్యశాస్త్రి విషయ నిర్ణయసభలో బలవంతంగా ప్రవేశించి ఎవరెన్ని చెప్పినా బయటకు వెళ్ళకుండా కూర్చున్నాడు. ఎన్ని ఆటంకాలు పెట్టినా సభ జయప్రదంగా జరిగింది. వెయ్యిమంది కోయరైతులు సభకు హాజరయ్యారు. జమీందారీ రద్దు ఆవశ్యకతను గూర్చి జమీందారీ కమిటీ సిఫార్సులు గురించి శ్రీ మందేశ్వర శర్మ, పుసులూరి కోదండరామయ్య, యినుగంటి నారాయణరావు, కొర్రపాటి పట్టాభిరామయ్య, ముదుంచి వెంకట రంగహణాహరాచార్యులు మాట్లాడారు. ఈ గంగోలీ ఎస్టేట్‌లో తర్వాత రాజంపాలెం రైతాంగం జమీందారుకు వ్యతిరేకంగా పోరాడి భూములు సంపాదించుకున్నారు. గోపవరం రైతులు బహు తక్కువ ఖరీదుకు జమీందారు నుండి భూములు కొనుక్కొన్నారు. రైతాంగంలోని ఈ చైతన్యం గమనించిన జమీందారు, ఐక్యత సంఘ చైతన్యం ఏమాత్రం లేని వెనుకబడియున్న గ్రామాల రైతాంగాన్ని రాంపాలెం, హుకుంపేట, సాగిపాడు, లక్ష్మీనారాయణ దేవి పేట, కరగపాడు, బుచ్చంపాలెం భూముల నుండి రైతులను వెళ్ళగొట్టి స్వాధీనం చేసుకున్నాడు. అందుచేతనే ఈ గ్రామాలలో జమీందారు కుటుంబాలకు యిప్పటికీ మూడువేల యకరాలకు పైగా భూమియున్నది. ఈ భూమే కాకుండా కోయగ్రామాలు, పాత కుంకాల, కొత్త కుంకాల, రెడ్డి కుంకాల, పేద్రాల, జిల్లేళ్ళగూడెం నుండి గిరిజనులను లేవగొట్టి 570 ఎకరాలు జమీందారు స్వాధీనం చేసుకున్నాడు. పైన వ్రాసిన పోలవరం తాలూకా రైతు మహాసభలో చైతన్యవంతులైన గిరిజనులు దీనిమీద గొప్పపోరాటం చేశారు. జమీందారు సిబ్బందిని వెంటబెట్టుకొని ఏనుగుతో రైతులమీద దాడి చేశాడు. గిరిజనులు విల్లంబులు తీసుకొని కొట్టగా అది అడవులకు అడ్డుపడి పాపికొండలకు పారిపోయింది. జమీందారు సిబ్బంది కూడా పారిపోయారు. తరువాత ఆ ఏనుగును పట్టుకొని, జమీందార్ తిరిగి హుకంపేట తీసుకుని రాగా ఆ దెబ్బలకు ఆ ఏనుగు చచ్చిపోయింది. జమీందార్ కోయలను కోర్టుకు లాగారు. కోయలు పెట్టుకున్న లాయర్‌ను జమీందార్ డబ్బుతో కొనివేసి కోర్టుద్వారా పోలీసులతో భూములు వశపరుచుకున్నాడు. యిప్పటికీ యీ భూముల కొరకు పోరాడాలని కోయలు పెద్ద పట్టుదలగా వున్నారు.
- 7-1-1939న పశ్చిమగోదావరి జిల్లా జమీన్‌రైతు మహాసభ చింతలపూడి తాలూకా ధర్మాజీగూడెంలో జరిగింది. కామ్రేడ్సు పేటేటి వెంకటరత్నం, గారపాటి పాల్గొన్నారు. కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి గారు ప్రకాశం కమిటీ రిపోర్టు గురించి, రాష్ట్ర రైతుసంఘం సవరణలు గూర్చి ఉపన్యసించారు. బిల్లు పాస్‌కాకపోతే రైతులు సత్యాగ్రహం చేస్తారని హెచ్చరించారు.
- భీమవరం తాలూకా కాంగ్రెస్ సంఘ యాజమాన్యమున 1-2-1939న భీమవరంలో తాలూకా జమీన్‌రైతు మహాసభ భూపతిరాజు సోమరాజు గారి అధ్యక్షతన జరిగింది. కామ్రేడ్స్ సంకు అప్పారావు, యాళ్ళబండి పోలిశెట్టి, మైలవరపు రామారావు జమీందార్ రద్దు బిల్లు గూర్చి మాట్లాడారు.
- కాళీపట్నం జమీందారు రైతులను దగాచేసి మొత్తం భూములు తన స్వంతమని భూములను అమ్మకం పెట్టాడు. ఇది 7,500 ఎకరాల సమస్య. పోలీసులను గట్టుకొని 144 పెట్టించి రైతులను బెదిరించి లొంగదీయడానికి ప్రయత్నించాడు. ఈ సమస్య ప్రారంభంలో కామ్రేడ్స్ సంకు అప్పారావు, గొట్టుముక్కుల వెంకట్రామరాజు, కృత్తివెంటి వెంకటేశ్వరరావులు కాళీపట్నం వెళ్ళి మొత్తం రిపోర్టు

సేకరించి నరసాపూర్ తాలూకా కాంగ్రెస్ సంఘానికి అప్ప జెప్పడం జరిగింది. నర్సాపురం తాలూకా కాంగ్రెస్ సంఘం ఆధ్వర్యాన తరువాత సత్యాగ్రహ పోరాటం జరిగింది. నాలుగు రోజులు 7-3-39 నుండి 10-3-39 వరకు సత్యాగ్రహం జరిగింది. మొదటిరోజు సంకు అప్పారావు, భూపతిరాజు లక్ష్మీనరసింహరాజు గార్ల నాయకత్వాన 40 కాళీపట్నం రైతులు అరెస్టు అయ్యారు. రెండవ దినం 30 మంది స్త్రీల మీద, 40 మంది పురుషుల మీద లాఠీచార్జీ చేసి 27 మంది స్త్రీలకు కఠినశిక్ష వేశారు. 9వ తేదీన కామ్రేడ్స్ ఉద్దరాజు మాణిక్యాంబ, అల్లూరి అన్నపూర్ణమ్మ గార్ల నాయకత్వాన 400 మంది స్త్రీ పురుషులు సత్యాగ్రహం చేశారు. ఆ రోజు మాణిక్యాంబ, అన్నపూర్ణమ్మగార్లతో 40 మందిని అరెస్టు చేశారు. 10వ తేదీన 20 మంది స్త్రీలను అరెస్టు చేశారు. రాష్ట్ర రైతుసంఘ అధ్యక్షులు కొమ్మారెడ్డి సత్యనారాయణ గారి పిలుపుతో కాళీపట్నం రైతుల పోరాటాన్ని బలపరుస్తూ రాష్ట్రమంతటా సభలు జరిగాయి. ఈ జిల్లాలో చాలా గ్రామాలలో సభలు జరిగాయి. కాళీ పట్నం దినోత్సవాన్ని బలపరుస్తూ రాష్ట్ర కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ తీర్మానించింది. అఖిల భారత రైతుసంఘ అధ్యక్షులు స్వామి సహజానంద సరస్వతి, ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ రంగా, సంయుక్త కార్యదర్శులు ఇందూలాల్ యాగ్నిక్, బి.పి.యల్ బేడీ, అవధేశ్వర ప్రసాద్ సిన్హా ఈ అయిదుగురు పోలీసుల అత్యాచారాన్ని ఖండిస్తూ కాళీపట్నం పోరాటాన్ని బలపరచారు. దండు సత్యనారాయణరాజు గారు యం.యల్.ఏ, గొట్టుముక్కల వెంకన్న గారు యం.యల్.ఎ, భూమి మీద హక్కు రైతులదేయని వీరిద్దరూ రెవెన్యూ మంత్రి ప్రకాశం గారు కాళీపట్నం వచ్చినప్పుడు మెమోరాండం యిచ్చారు. ఈ విధంగా కాళీపట్నం రైతుల పోరాటాన్ని జిల్లాలో బలమైన కాంగ్రెస్‌వర్గం బలపరిచింది. భోగరాజు పట్టాభిసీతారామయ్య మొదలగు మితవాదులు వ్యతిరేకించారు. ఈ పోరాటం ముఖ్యంగా ఈ జిల్లాలో రైతాంగాన్ని కదిలించివేసింది. యువకులలో పెద్ద ఉత్సాహాన్ని కలుగచేసింది. కాంగ్రెస్ మంత్రుల నాయకుల సలహాప్రకారం సత్యాగ్రహం విరమించాం. ప్రకాశంగారు స్వయంగా కాళీపట్నం వచ్చి రైతుహక్కులు న్యాయమేనని అంగీకరించారు. సబ్ జైళ్ళలోని వారందరిని విడుదల చేశారు. ఈ సమస్య పరిష్కారం కాకపూర్వమే యుద్ధం రావడం కాంగ్రెస్ మంత్రులు రాజీనామాలివ్వడం జరిగింది. రైతుసేవకులందరి మీద నిర్బంధములు జోరైనవి. ఈ పరిస్థితుల మూలంగా రైతుల హక్కులు పూర్తిగా జయం పొందలేదు.

- 1939లో రెండవ ప్రపంచయుద్ధం రావడంతో కాంగ్రెస్ ప్రభుత్వాలు రాజీనామాలివ్వడంతో రైతు సంఘ కార్యకర్తల పై నిర్బంధవిధానం హెచ్చింది. జిల్లాలో ముఖ్యంగా రైతు నాయకులందరిపైన బాగా దాడి సాగింది. అల్లూరి, గారపాటి, పేటేటి వెంకటరత్నం, కలిదిండి బంగారరాజు, లక్ష్మీనరసరాజు, ఉద్దరాజు సూరపరాజు, తనికెళ్ళ వెంకట చలపతి, కృత్తివెంట వెంకటేశ్వరరావు, అన్నె వెంకటేశ్వర రావు, వంకినేని సత్యనారాయణ, కలిదిండి సూర్యనారాయ ణరాజు, యస్. ఆనందరావు, గొట్టుముక్కల వెంకట్రామ రాజు యింకా అనేకమంది రైతు సేవకులు యింటర్ను మెంటులు, డిటెన్షనులు, దీర్ఘశిక్షలకు గురైనారు. మృత్యుం జయుడు, ఉద్దరాజు రామం, సంకు అప్పారావు, దాట్ల సూర్యనారాయణరాజులు ప్రభుత్వానికి పట్టుబడకుండా రహస్యంగా ఉండి పని చేశారు.
- జిల్లాలో రైతు ఉద్యమాన్ని ఆదర్శప్రాయంగా నడిపిన యిద్దరిలోను మూడు సంవత్సరాలు కార్యదర్శిగా పనిచేసిన కలిదిండి సుబ్రహ్మణ్యంగారు తీవ్ర అనారోగ్య కారణాలవలన ఉద్యమం నుండి దూరంగా వెళ్ళారు. 1940 ఏప్రిల్‌లో జిల్లా రైతు ఉద్యమానికి పట్టుకొమ్మయైన కొమ్మారెడ్డి సత్యనారా యణమూర్తిగారు చనిపోయారు. ప్రభుత్వ నిర్బంధ విధానంతో బాటు వీరిద్దరు ఉద్యమంలో లేకపోవడం రైతు ఉద్యమానికి తీవ్రమైన నష్టాన్ని కలుగచేసింది.
- 1941లో తిరిగి రైతుసంఘం కార్యాచరణకు పూనుకున్నది. సుప్రసిద్ధ కాంగ్రెసువాదులైన వనం కృష్ణమూర్తిగారు అధ్యక్షులుగాను, యాళ్ళబండి పోలిశెట్టిగారు కార్యదర్శిగా పనిచేశారు. ఈ కాలంలో రాష్ట్ర రైతుసంఘం రంగాగారి నాయకత్వాన యున్నది. యుద్ధం వచ్చిన తరువాత కాంగ్రెసు - కమ్యూనిస్టు పార్టీల మధ్య విభేధాలు పెరుగుతూ వచ్చాయి. జిల్లాలో రైతుసంఘ సభ్యత్వం చేర్పించుటకు సభ్యత్వ పుస్తకాలు ఇవ్వలేదు. చేర్పించిన పుస్తకాలు అంగీకరించలేదు. ఈ విధంగా జిల్లాలో రైతుసంఘ ఎన్నికలు జరుపుటకు అవకాశాలు లేకుండా చేశారు. "సంఘాన్ని పునరుద్ధరించాలి" యనేసాకుతో రంగాగారు ఏలూరు వచ్చి అనేక కష్టనష్టముల కోర్చి ఆదర్శంగా పనిచేస్తున్న జిల్లా రైతుసంఘ అధ్యక్ష, కార్యదర్శులుగా యున్న వసల కృష్ణమూర్తి, యాళ్ళబండి పోలిశెట్టిగార్లను ఏమాత్రం సంప్రదించకుండా సామవేదం సత్యనారాయణ మూర్తి, కొమ్మారెడ్డి సూర్యనారాయణగార్లను మరికొందరిని జిల్లా రైతుసంఘములో నామినేట్ చేశారు. ఈ విధంగా జిల్లాలో రంగావర్గం రైతుసంఘ విచ్ఛిన్నకర చర్యలను ఎదుర్కొనవలసి వచ్చింది. చివరకు నిర్బంధ విధానం సాకు జూపి రంగా రాష్ట్ర రైతు సంఘాన్ని రద్దుచేసి నెల్లూరు వెంకట్రామానాయుడును నామినేట్ చేశారు. 1942

ఆఖరులో జిల్లాలో 6వేల రైతుసంఘ సభ్యత్వం చేర్పించబడింది.

- 1943లో పేటేటి వెంకటరత్నం అధ్యక్షులుగాను, కృత్తి వెంకటేశ్వరరావుగారు కార్యదర్శిగాను ఎన్నుకోబడ్డారు. ఏడు తాలూకా సంఘాలు పనిచేశాయి. 60 గ్రామాలలో రైతు సంఘాలేర్పడి యిదివరకెన్నడూ లేనంత నిర్మాణాత్మకంగా రైతుసంఘం కృషిసల్పింది.
- 1943లో తణుకు తాలూకా వేలివెన్నులో రైతాంగ విద్యాలయం నడుపబడింది. ఇందులో యిరిగేషన్ సమస్యలు, ఎస్టేట్ లాండ్‌యాక్టు, గ్రామ సంఘాల నిర్మాణం, రైతుకూలి సామరస్యం, యితర గ్రామీజీవితానికి, సంఘానికి సంబంధించిన సమస్యలు గూర్చి బోధించటం జరిగింది.
- 1941 జూన్ 22న ఫాసిస్టు జర్మనీ, సోవియట్‌పై దాడి చేసింది. దీనికి ఫాసిస్టు వ్యతిరేక నాయకులను జైలునుండి విడుదల చేయాలని ప్రపంచం అన్ని దేశాలలోనూ ఆందోళన సాగింది. మనదేశంలోనూ ఆందోళనసాగింది. దీని పర్యవసానంగా 1942 జూన్‌లో జిల్లాలలోని రైతుసేవకులు చాలామంది విడుదల చేయబడ్డారు.
- 1943 వచ్చేసరికి దేశంలో ఆహార కరువుతోపాటు ఆర్థిక సంక్షోభం ఏర్పడింది. రాయలసీమలో కరువుకాటకాలు ఏర్పడినాయి. బెంగాలలో ఘోరమయిన కరువుతో 35 లక్షల మంది జనం చనిపోయారు. ఈ స్థితిలో జిల్లాలో రైతుసంఘం రాయలసీమ కరువు నివారణకు రూ.1127 – 12 ధనం, వెయ్యి వస్త్రాలు, బెంగాల్ కరువుకు రూ.379– 70 వసూలు చేసి పంపించింది. కరువు కాటకాల నెదుర్కోవటానికి జిల్లా రైతుసంఘం తీవ్రకృషి మొదలుపెట్టింది. ఎరువుల ఉపయోగం గూర్చి, అధికాహారోత్పత్తి, దేశరక్షణల సంబంధం గూర్చి ప్రచారం చేశాం. ఎరువులను సకాలంలో సప్లయిచేయాలని ఆందోళన చేశాం. జిల్లాలో బొండాడ, కల్వపూడి, వేలివెన్ను, మోర్త, లింగబోయినచర్ల గ్రామాలలో బీదరైతులచే బంజరుభూములకు దరఖాస్తులు పెట్టించి 3040 ఎకరాలు ఇప్పించాం.

వ్యవసాయోత్పత్తికి, అవసరమైన బండిపట్టాలు, పలుగులు, పార్లకు పెద్దయెత్తున కరువు ఏర్పడింది. ప్రైవేటు వ్యాపా రులు, వ్యవసాయ డిమాన్‌స్ట్రేటర్లు కూడా వీటిని బ్లాక్‌లో విపరీతరేట్లకు అమ్మకం సాగించారు. దీనిమీద రైతు సంఘం జిల్లా అంతటా ఆందోళన చేయడమే కాకుండా భీమవరం, నర్సాపురం, తణుకు, తాడేపల్లిగూడెం, ఏలూరు, చింతల పూడి తాలూకాలలో బ్లాక్ మార్కెట్‌లో యున్న సరుకు పట్టించి కంట్రోల్ రేటుకు అమ్మించడమేగాక పెద్దయెత్తున పైతాలూకాలలో పలుగులు, పారలు, వగైరా కార్ఖానాలు పెట్టి, చేయించి రైతు సంఘమే సప్లయి చేయడం జరిగింది. ఇంతేగాకుండా గ్రామాలలో కిరోసిన్ కరువు ఏర్పడి పేద ప్రజలు ఇబ్బందులకు గురవుతుంటే రైతు సేవకులు కృషిచేసి చాలావరకు ఆ ఇబ్బందిని తొలగించారు. యుద్ధబాండ్లు కట్టలేని పేద రైతులను స్థానిక అధికారులు నిర్బంధిస్తుంటే జిల్లా అంతటా కృషిచేసి పైఅధికారులకు తెలిపి, రాయ బారం నడిపి స్థానిక అధికారుల ఒత్తిడి తగ్గించాం. ఎకరాల వారీగా యుద్ధబాండ్లు కొనాలనే దానిని జిల్లాలో ఆపివేయించాం.

దాళ్వా ఊడ్చి 160 వేల ఎకరాలలో సుమారు 80 వేల ఎకరాలు నీరు లేక నెర్రలు గొట్టి నాశనమయ్యే స్థితి వస్తే సంఘం ద్వారా మహజర్లు, టెలిగ్రాములు ఇచ్చి అధికారుల వద్దకు రాయబారం వెళ్ళి తీవ్ర ఆందోళన చేసి నీరు సప్లయి చేయించుటేగాక ఏటా ఏప్రిల్ నెలాఖరుకు కట్టు కాలువలు మే నెల 10వ తేదీ వరకు తెరచియుంచబడినాయి. ఈ దశలో జిల్లా రైతుసంఘం రైతులకు నీటివనరులు కలిగించుటకు చాలా పెద్దయెత్తున కృషిచేసింది. తుమ్మూరు ప్రాజెక్టు, కానూరు – పెండ్యాల స్కీములు, అనుములంక ప్రాజెక్టు, తమ్మిలేరు ప్రాజెక్టులు గూర్చి నిర్మాణయుతంగా ఆందోళన చేయడం జరిగింది. పైవిధంగా నూతన నీటి వనరులకు కృషి చేయడమే గాక జిల్లాలో కాలువల మరమ్మతులకు రైతుసంఘం స్వయంగా కృషిచేసింది. కాలువలు మెరక వేయడం వలన ఉత్పత్తి తగ్గి రైతుల ఆదాయానికి నష్టం రావడం, దేశంలో కరువు పరిస్థితులు గ్రామాలలో ప్రచారం చేశాం. చేస్తుంది లేయని రైతులు ఉపేక్షించరాదని చెప్పి కాలువలు కమిటీ ఏర్పాటుచేశాం. 1943 సంవత్సరంలో త్రవ్వు పనిరేట్లను పెంచవలసిందిగా రైతు సంఘం ఆందోళన చేయగా రేట్లు పెంచబడ్డాయి. ఈ పరిస్థితులలో 1944 నర్సాపురం తాలూకాలోని కోడేరు బ్యాంకు కాలువ, 1945 సంవత్సరంలో తణుకు తాలూకా లోని అత్తిలి కాలువ రైతు సంఘాల ద్వారా త్రవ్వించడం జరిగింది.

మండు టెండలు, వడగాడ్పులు, దాళ్వా కోతలు మూలంగా కూలీలు దొరకడం లేదు. ఈ పరిస్థితులలో మనకు పలుకుబడ యున్న గ్రామాల నుండి కూలీలను సమీకరించి వారికి బియ్యం వసతులు వగైరా ఏర్పాటు చేశాం. స్వయంగా జిల్లాలోని రైతు నాయకులు, కూలీ యువజనసంఘ నాయకులు, రైతుసంఘ కార్యకర్తలు వందల సంఖ్యలో త్రవ్వటం, తట్టలు మోయడం జరిగింది. ఇది చూచి అనేక మంది రైతులు తాము స్వయంగా వచ్చి పాలేళ్ళను తీసుకొచ్చి వలంటీర్లుగా పనిచేశారు. పని జరిగినన్నాళ్ళు పనిచేసిన వారిలో బుర్రకథలు, ఉపన్యాసాల ద్వారా దేశరక్షణ బాధ్యత గుర్తింపజేస్తూ ఉత్సాహం కలుగచేయబడింది. పి.డబ్ల్యు.డి. వారు సహితం కాలువపని పూర్తికావడం అసంభవం అని తలచి మానవలసిన పనిని రైతుసంఘం

కార్యదీక్షతో సాధించింది. యిట్లాగే మన సంఘం కృషి వలనే భీమవరం తాలూకాలోని నవుదూరు, కోళ్ళపర్రు పంట కాలవల ను, తాడేపల్లిగూడెం తాలూకాలో కావుపాడు కాలువ, అప్పారావు పేటకు సంబంధించిన అర్జమ్మ కాలువను, లింగబోయినచర్లకు సంబంధించిన కొత్త బోదెను, వెంపకాలువను రైతుసంఘ ఆధ్వర్యాన త్రవ్వడం జరిగింది. ఇందులో కొన్ని ప్రభుత్వ డబ్బు అక్కరలేకుండా రైతులే రైతుసంఘాల ఆధ్వర్యాన త్రవ్వుకోవడం జరిగింది. రైతు సంఘం ఆందోళన వల్లనే చింతలపూడి తాలూకాలోని కల్యాణరాయుడు చెరువుని తర్వాతకాలంలో ప్రభుత్వం మరమ్మతులు చేయడం జరిగింది.

- భీమవరం, నర్సాపురం తాలూకాలలో అప్పటికి మొదటి పంటకు ఎరువులు వాడే అలవాటు లేదు. రైతుసంఘ ప్రచారం వలన 1944లో ఈ తాలూకాలలో సార్వా పంటకు కూడా ఎరువు వాడారు. చింతలపూడి తాలూకాలో పశువుల ఎరువులు తప్ప, వేరుశనగపిండి, ఆముదంపిండి కూడా వాడేవారు కాదు. 1943లో రైతుసంఘ కార్యకర్తలు స్వయంగా ఉపయోగించి ప్రచారం చేసిన ఫలితంగా 1944లో విరివిగా వాడారు. ఈ విధంగా అధికోత్పత్తికి ఎరువులు వాడకాన్ని కూడా రైతుసంఘమే ప్రోత్సహించి అమలుజరిపించింది.
- 1944లో ఉద్దరాజు సూరపరాజు అధ్యక్షులుగాను, అన్నే వెంకటేశ్వరరావు కార్యదర్శిగాను జిల్లా రైతుసంఘానికి ఎన్నుకోబడ్డారు.
- 1944 సంవత్సరంలో అఖిల భారత రైతుమహాసభ విజయవాడలో జరిగింది. మహాసభకు ముందు జిల్లా అంతటా బుర్రకథలతో, ప్రభలతో ఊరేగింపులతో, బహిరంగసభలతో వందల గ్రామాలలో ప్రచారం చేశాం. శాసనసభల ఎన్నికలలోని ప్రచారాన్ని మరిపించే విధంగా ప్రచారం సాగించాం. 31 దళాలు 226 గ్రామాలలో సుమారు 3 లక్షల ప్రజలలో ప్రచారం చేశాం. జిల్లా నుండి 300 మంది వలంటీర్లను, 8 వేల రూపాయల విరాళం పంపించాం. జిల్లా నుండి వేలకొలది జనం తిరనాళ్ళకు వెళ్ళినట్లు తరలివెళ్ళారు. ఈ ప్రచారం ఫలితంగా రైతాంగంలో రాజకీయ చైతన్యం పెరిగింది. నూతనోత్సాహం ఆత్మవిశ్వాసం కలిగింది. 1942 ఘటనలు తరువాత జిల్లాలో పౌరసత్వ హక్కులకు భంగం వాటిల్లినా భీమవరం, చింతలపూడి తాలూకాలలో అఖిల భారత రైతుమహాసభ కార్యక్రమంతో తిరిగి పౌరసత్వ హక్కులు నెలకొల్పబడ్డాయి.
- 1945లో నర్సాపురం తాలూకా జిన్నూరులో యిట్లాంటి వాతావరణంలో జిల్లా రైతు మహాసభ పెద్దయెత్తున జరుపుకున్నాం. మహాసభలో ఉద్దరాజు సూరపరాజును అధ్యక్షులుగాను, గారపాటి సత్యనారాయణను కార్యదర్శి గాను ఎన్నుకోవడమైనది. ఈ మహాసభలు కలిగించిన ఉత్సాహంతో అనేకమంది యువకులు రైతుసేవ చేయుటకు ముందుకు వచ్చారు. జిల్లా రైతుసంఘం పైన వ్రాసిన విధంగా నిర్మాణయుతంగా సంఘసేవ చేయడమే గాక చరిత్రలో బంగారపుటక్షరాలతో లిఖింపదగిన బ్రహ్మాండమైన జమీందారీ వ్యతిరేక రైతుపోరాటాలను నడిపింది.

### జమీందారుకు వ్యతిరేకంగా కలవలపల్లి గ్రామపోరాటం

1942 - 44 మధ్య కొవ్వూరు తాలూకా కలవలపల్లి - సూరాపురం గ్రామాల రైతులు జిల్లా రైతుసంఘ నాయకత్వాన జమీందారుకు వ్యతిరేకంగా పోరాడి భూములు సంపాదించుకున్నారు. అనేక ఘర్షణలు జరిగాయి. కామ్రేడ్ మద్దుకూరి నారాయణ తలపై దెబ్బతగిలి చిట్లిపోయింది. జిల్లా రైతుసంఘం తరపున కామ్రేడ్ ఈడ్పుగంటి పూర్ణచంద్రరావు ఈ ఉద్యమాన్ని నడిపారు. స్థానికంగా మద్దుకూరి నారాయణ, ముళ్ళపూడి పుల్లయ్య, ముళ్ళపూడి కృష్ణారావులు దీనికి నాయకత్వం వహించి నడిపారు.

### పెండ్యాల రైతుల పోరాటం

ఈ భూములు అంబర్‌పేట మరియు వీరవల్లి ఎస్టేటులోనివి. ఎలమర్రు జమీందారుని 860 ఎకరాలు గొప్ప సారవంతమైన గోదావరి లంకభూములు, తణుకు తాలూకా కానూరు రెవెన్యూ గ్రామానికి చెందినభూమి, అందుచే దీనిని కానూరు లంకయని పిలిచేవారు. ఈ భూములను పెండ్యాల - కానూరు అగ్రహారం గ్రామాల రైతులు సాగుచేసేవారు. పెండ్యాల గ్రామం కొవ్వూరు తాలూకాలోనిది. జమీందార్ సారవంతమైన ఈ లంక భూములను అమ్ముకొని డబ్బు చేసుకోవలెనని ప్రయత్నించాడు. అట్లా వీలులేదని, ఈ భూములు రైతులకే చెందాలని సాగుచేస్తున్నారు. వీరికి మద్దతుగా రెండు గ్రామాలలోని అత్యధిక ప్రజానీకం ఒక్కమాట మీద ఐక్యంగా నిలబడ్డారు. ఈ భూములహక్కు రైతులదేనని అనేక పిటిషనులు అధికారులకు పెట్టారు. జమీందారు ఏమీ చేయలేకపోయాడు.

రెండు గ్రామాల రైతులు రైతుసంఘంలో చేరారు. రైతుసంఘ నాయకులతో అనేక బహిరంగసభలు జరిగాయి. ప్రతిరోజు సభలు జరుగుతుండేవి. లంకభూమి రైతులపోరాట కమిటీ ఏర్పడింది. ఉద్యమానికి పెండ్యాల గ్రామ వీరరైతాంగం కేంద్రంగ నిలబడింది. కామ్రేడ్స్ దేవరకొండ సుబ్బారావు, ఈడ్పుగంటి పూర్ణచంద్రరావులు డైరెక్టుగా గ్రామంలో ఉంటూ ఉద్యమానికి నాయకత్వం వహించారు. జిల్లా నాయకత్వం పరకాల పట్టాభిరామారావు, ప్రేరేపు మృత్యుంజయుడు, ఎస్.ఆర్. దాట్ల, అన్నే వెంకటేశ్వరరావు, సంకు అప్పారావు,

ఉద్దరాజు రామం రహస్యంగా ఉంటూ ఉద్యమానికి తోడ్పడ్డారు. గ్రామంలో సరిపెళ్ళ వెంకట నరసరాజు (దద్దయ్య), ముదునూరు దేవళరాజు లంక వెంకట్రావు (అగ్రహారం), చేకూరి భద్రిరాజు, కూపరాజు సూరపురాజు, సీమాల రామన్న, పేరిచెర్ల అప్పల నరసింహరావు, గోపాలం, బీర గురవయ్య మొదలగు వారు పోరాటంలో పాల్గొన్నారు. 150 నాగళ్ళతో ఒక్కసారిగా లంకలోకి రైతాంగం ప్రవేశించింది. రెండు సంవత్సరాలు అనగా 1949, 50 పటంలు పొగాకు, జొన్న, ఉలవ మొదలగు పంటలు రైతులే కోసుకొని అనుభవించారు.

- 1949లో రైతుసంఘం మీద వచ్చిన ఘోర నిర్బంధ విధానాన్ని జమీందారు ఉపయోగించుకున్నాడు. 80 మంది రైతుల మీద అనేక కేసులు దఫదఫాలుగా పెట్టారు. ఈ లంకల పోరాటానికి నాయకత్వం వహించే దేవరకొండ సుబ్బారావు, పూర్ణచంద్రరావులను అరెస్టు చేయాలని పెండ్యాల గ్రామం మీద 22 సార్లు పోలీసుల దాడులు జరిగాయి. ఒక్కొక్క దాడిలో నూరుకు పైగా పోలీసులు వుండేవారు. గ్రామంలో స్త్రీ పురుష విచక్షణ లేకుండా విచ్చలవిడిగా లాఠీలతో బాదేవారు. యిండ్లలో దూరి సామానులు బద్దలు కొట్టేవారు. ఈ దాడులు 1949 జూన్ నుండి 1950 ఫిబ్రవరి వరకు సాగాయి. ఈ దాడులకు తట్టుకోలేక కొన్ని కుటుంబాలు గ్రామాలు వదిలి ఇతర గ్రామాలకు వెళ్ళిపోయారు. చివరకు 1950 మార్చి 9న కామ్రేడ్ దేవరకొండ సుబ్బారావును, 1950 జూన్ 22న పూర్ణచంద్రరావును ప్రభుత్వ పోలీసులు కాల్చి చంపారు.

ఈ నిర్బంధ విధానాన్ని ప్రజానీకంలో యుండే భీతావహాన్ని ఉపయోగించుకొని లంక స్వాధీనం చేసుకోవాలని జమీందారు 1950లో తన అనుచరులతో ట్రాక్టరు తెచ్చి దున్నుటకు ప్రయత్నించారు. 30 మంది పోలీసులను సహాయం తెచ్చుకున్నాడు. కాని పెండ్యాల - కానూరు అగ్రహారానికి చెందిన 50 మంది స్త్రీలు ప్రధానంగా హరిజన స్త్రీలు ట్రాక్టరుకు అడ్డంగా పడుకున్నారు. విధిలేక జమీందారు అనుచరులు, పోలీసులు వెనుకకు పోయారు.

నిర్బంధ విధానం, ఘోరహింసలు తరువాత కాంగ్రెసు వారు ఈ వుద్యమానికి నాయకత్వం వహించారు. ముఖ్యంగా వేగిశిన పెదసుబ్బరాజు (భీమవరం) డబ్బు వసూలు చేసి, ఉద్యమాన్ని కోర్టుల పాలుచేసి, డబ్బు దుర్వినియోగం చేసి ఉద్యమాన్ని నష్టపరిచారు. రైతుసంఘ నాయకత్వం జైలునుండి, రహస్య జీవితం నుండి బయటికి వచ్చేసరికి ఉద్యమం చల్లారింది. హైకోర్టులో జమీందార్ గెల్చాడు. లంకలో పోలీస్ స్టేషన్ పెట్టించాడు. ఉద్యమం ఉధృతం తగ్గడం, కోర్టులో జమీందారు గెలవడం పోరాటానికి నాయకత్వం వహించిన నాయకులు లేకపోవడం రైతాంగంలో నిరాశ, నిస్పృహ, నిరుత్సాహం కలిగి వారి మనోనిబ్బరాన్ని దెబ్బకొట్టినాయి. జమీందారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని రైతాంగాన్ని చీల్చి లంకభూములు అమ్ముకున్నాడు.

## గోపాలపురం జమీందారీ వ్యతిరేక పోరాటం 1947లో

కొవ్వూరు తాలూకా గోపాలపురం జమీందారుకు 15 గ్రామాలు ఉండేవి. ఇందులో సంజీవపురం, బుచ్చంపేట అనేవి గిరిజన గ్రామాలు. మొత్తం గ్రామాలలోని భూములన్ని స్వాధీనం చేసుకోవాలని జమీందార్ ప్రయత్నించాడు. రైతాంగం దీనిని ప్రతిఘటించారు. ముఖ్యంగా సంజీవపురం, బుచ్చంపేట కోయరైతాంగం, కరిచర్లగూడెం, నందిగూడెం గ్రామాల రైతులు జిల్లా రైతుసంఘం నాయకత్వాన గట్టిగా నిలబడి పోరాటం సాగించారు. రైతుసంఘాలేర్పరుచుకొని సంఘటితంగా నిలబడ్డారు. తాలూకాలోని అనేక గ్రామాలలో రైతుల బహిరంగసభలు పెట్టి జమీందారీ రైతుల పోరాటనిధికి అనేక యితర గ్రామాలలో డబ్బు వసూలు చేశారు. గోపాలపురం గ్రామ కాంగ్రెసు కమిటీ రైతులదే న్యాయమని తీర్మానించింది.

గోపాలపురంలో ఒక రైతు సమావేశం జరుగుతుండగా కామ్రేడ్ పట్టాభి రామారావుతో కలిపి 10 మంది రైతులను జమీందారు అరెస్టు చేయించారు. వీరిలో కోయ, ముస్లిం రైతులు కూడా ఉన్నారు. వీరిమీద కొవ్వూరు కోర్టులో జమీందారు భూములలోకి అక్రమంగా ప్రవేశిస్తున్నారని కేసు పెట్టారు. వీరందరూ బెయిలుపై బయటకు వచ్చారు.

కేసు పెట్టినా రైతులేమీ భయపడలేదు. జమీందార్ దౌర్జన్యంగా తన సిబ్బంది నుపయోగించి భూములు స్వాధీనం చేసుకోవాలంటే రైతులు వాళ్ళ ఆటలు సాగకుండా వారిని తన్ని తరిమివేశారు. నాలుగు గ్రామాలలోని రైతులు భూములన్నీ పూర్తిగా దున్ని పైర్లు వేశారు. కక్షతో జమీందారు పైర్లు పాడు చేయించబోతే రాత్రింబవళ్లు విల్లంబులు మొదలగు ఆయుధాలతో నెలల తరబడి రైతులు పైర్లు రక్షించుకున్నారు.

జమీందార్ ఎట్లాగైనా రైతులకు పంట దక్కకుండా చేయాలని రిజర్వు పోలీసు బలగాన్ని రప్పించారు.

బుచ్చంపేటలో కోయరైతులు తమ చేను కోసుకుంటున్నారు. జమీందారు మనుషులు వస్తారని విల్లంబులతో వచ్చి కోతకోస్తున్న వారికి రక్షణగా నిలబడ్డారు. రెండు లారీలతో పోలీసులు వచ్చి చేసుకోసే వారిమీద స్టెన్‌గన్‌తో కాల్పులు కాల్చారు. అక్కడికక్కడే ముగ్గురు చనిపోయారు. తరువాత ఒక కోయరైతుకు గుండ్లదెబ్బల వలన కాలు తీయవలసి వచ్చింది. మొదట కాల్పులు తరువాత కోయలు విల్లంబులతో ప్రతిఘటించారు. ఒక ఇనస్పెక్టరుని కోయలు ఈటెతో కొట్టారు. అది విషపూరితమైనదని తరువాత తేలింది. యినస్పెక్టరు మూడు నాలుగు నెలలు ఆస్పత్రిలో యుండి కోలుకున్నాడు.

జమీందార్ రైతులను, కొంతమంది రైతు కార్యకర్తలను కలిపి కేసుపెట్టాలని అరెస్టులకొరకు ప్రయత్నించాడు. అందుచే గుండ్లు దెబ్బలు తిన్న రైతులు, రైతు కార్యకర్తలు రహస్యంగా ఉండవలసి వచ్చింది. గుండ్ల దెబ్బలు తిన్న మరికొంతమంది రైతులు రహస్యంగా ప్రయివేటుగా వైద్యం చేసుకోవలసి వచ్చింది. రైతు కార్యకర్తలను అరెస్టు చేయించాలని రైతుల యిండ్లు, కోయలు యిండ్లను చాలా గ్రామాలలో సోదాచేయడం, ప్రజానీకాన్ని భీభత్సం చేయడం జరిగింది. రైతుసంఘం, కాంగ్రెస్ కమ్యూనిస్టు పార్టీలు పోలీసుల కాల్పుల మీద విచారణ కమిటీ వేయాలని ఆందోళన చేశారు. కాల్పులు జరపగానే జిల్లా రైతు సంఘాధ్యక్షులు యాళ్ళబండి పోలిశెట్టిగారు వచ్చి రైతుల హక్కుల కొరకు గట్టిగా నిలబడి పనిచేశారు.

కాల్పులు జరిగిన తరువాత టంగుటూరి ప్రకాశం పంతులు గారు బుచ్చంపేట వచ్చి రైతాంగాన్ని పరామర్శ చేశారు. ప్రభుత్వం విచారణ కమిటీని వేసింది. దీనితో నిర్బంధ విధానం తాత్కాలికంగా తగ్గి రైతు కార్యకర్తల కొరకు గాలించడం ఆగిపోయింది. రైతుల హక్కులు న్యాయమైనవని రైతుసంఘాలు, కమ్యూనిస్టు పార్టీతో బాటు తాలూకా కాంగ్రెసు నాయకులు గెడా రఘునాయకులు, నరహరశెట్టి లక్ష్మీపతిరావుగార్లు రైతుల హక్కులు బలపరుస్తూ ప్రచారం చేశారు. గోపాలపురం గ్రామ కాంగ్రెసు కమిటీ కాల్పులు నిరసిస్తూ తీర్మానం చేసింది.

కాల్పులైన నెల తరువాత కోయరైతులు చనిపోయిన చోట మృతవీరుల సంస్మరణార్ధం సభ జరిగింది. రవాణా సౌకర్యాలు లేకుండా బహు మారుమూల నున్న ఈ ప్రాంతానికి దూర ప్రాంతాల నుండి కూడా బండ్లు కట్టుకొని కాంగ్రెస్ – కమ్యూనిస్టు విబేధాలు లేకుండా స్త్రీ పురుషులు హాజరైనారు. జిల్లా మహిళా సంఘాధ్యక్షురాలు శ్రీమతి భూపతిరాజు వెంగాయమ్మ, జిల్లా రైతు సంఘాధ్యక్షులు శ్రీ యాళ్ళబండి పోలిశెట్టి, కాంగ్రెస్ నాయకులు గెడా రఘునాయకులు, నరహరశెట్టి లక్ష్మీపతిరావు యింకా అనేకమంది రైతుసంఘ కార్యకర్తలు ఆ సభకు వచ్చారు. కామ్రేడ్ ఈడ్పుగంటి పూర్ణచంద్రరావు మొదటినుండి ఉద్యమానికి నాయకత్వం వహించారు. కామ్రేడ్ పరకాల పట్టాభిరామారావు, పాలెంపాటి వెంకట్రాజు, తోట బ్రహ్మానందం, పి. రామచంద్రరావు, వీర్రాజు, కోయరైతు నాయకులు రాజయ్య, మోగయ్య మొదలగువారు అనేక కష్టనష్టాలకు నిర్బంధాలకోర్చి ఈ రైతు ఉద్యమాన్ని సాగించారు. ప్రభుత్వం నియమించిన కమిటీ పోలీసు కాల్పులు సబబా కాదా అని విచారించింది. సహజధోరణిలో కాల్పులను సమర్థించింది. భూమిహక్కు జమీందారులదా, రైతులదాయని విచారణ జరుగలేదు. యింతలో రైతు నాయకుల మీద ఘోర నిర్బంధ విధానం వచ్చిపడి రైతులకు న్యాయం జరిగే అవకాశం లేకుండా చేసింది.

## పోతునూరు రైతుల జమీందారీ వ్యతిరేకపోరాటం 1946 - 48

పోతునూరు చింతలపూడి తాలూకాలో ఒక మొఖాసాగ్రామం. ఆనాటి నుండి 300 ఎకరాలు సాగుచేసుకుంటున్న రైతులను భూమినుండి వెళ్ళగొట్టటానికి, వాటిని తిరిగి అమ్ముకోవాలని 1946లో మొఖాసాదారు తీవ్ర ప్రయత్నం సాగించారు. 1946లో తాలూకా రైతుసంఘం తరపున కారుమూడి సత్యనారాయణరెడ్డి, మేడా పిచ్చయ్యచౌదరి, యాళ్ళబండి రంగనాయకులు, మాదాసు వీరవెంకయ్య, మాదాసు శేషగిరిరావు, కంచన కాశీ విశ్వనాథం రైతుల పక్షాన నిలబడి పనిచేశారు. ప్రభుత్వానికి పిటిషనులు పెట్టించారు. సుమారు 15 బహిరంగసభలు పెట్టారు. రైతులు ఐక్యంగా నిలబడ్డారు. ఇతర గ్రామాల రైతులు కూడా వీరిని బలపరిచారు.

30మంది రైతులను సత్యనారాయణరెడ్డి, పిచ్చయ్య చౌదరి, రంగనాయకులతో కలిపి క్రిమినల్ కేసులు, బైండోవర్ కేసులు పెట్టారు.

ఇంతలో 1948లో కమ్యూనిస్టు పార్టీ మీద, రైతు కార్యకర్తల మీద నిర్బంధ విధానం వచ్చింది. నాయకులతో బాటు కమ్యూనిస్టులు కాకపోయినా ఈ గ్రామానికి చెందిన శేషవల్లి లక్ష్మయ్య, వెలుగు కోటయ్య అనే సామాన్య రైతులను కూడా ప్రభుత్వం డిటెన్యూలుగా తీసుకెళ్ళింది. ప్రభుత్వం సంవత్సరం దాటాక వీరిని విడిచిపెట్టింది. నాయకత్వం జైలులో వున్న అవకాశాన్ని తీసుకొని మొకాసాదారు రైతులతో రాజీచేసుకొన్నాడు. రైతులకు కొంతవరకే విజయం కలిగింది.

## తల్లవరం గ్రామ కోయరైతుల పోరాటం

పోలవరం తాలూకా ఏజన్సీ గ్రామం తల్లవరంలో గ్రామ ఉమ్మడిభూమి 90 ఎకరాలుండేది. గ్రామ మొకాసాదారు మాడి సోమయ్య దొర ఈ భూమి అంతా తానే అనుభవిస్తున్నాడటవు. గ్రామస్థులందరూ ఎన్ని విధాల కోరినా అందరిమీద దౌర్జన్యంగా నిరంకుశంగా పెత్తనం చెలాయిస్తూ గ్రామస్థుల కోర్కెలు తిరస్కరించాడు. దీనిమీద తాలూకా రైతుసంఘం తల్లవరం గ్రామస్థులనే కాకుండా కోండ్రుకోట, మాధాపురం, పెద్దూరు, గాజులగొంది గ్రామస్థులను కూడగట్టి బి.పి. గోపాలరాజుగారి నాయకత్వాన తల్లవరం రైతులు నాగళ్లు కట్టారు. భూమి ఆక్రమించారు. ఆ తరువాత సోమయ్య దొర తరపున పోలీసులు వచ్చి గోపాలరాజును అరెస్టు చేశారు. గోపాలరాజు అరెస్టు తరువాత కోండ్రకోట రైతు నాయకుడు పూనం చిన కన్నయ్య, అద్దేపల్లి వెంకట్రాజు, యిప్పుడు కాంగ్రెస్ ఎం.ఎల్.ఎ. పరకాల శేషావతారం ఈ పోరాటానికి నాయకత్వం వహించారు. మొఖాసాదారు అనేక పర్యాయాలు దారులు కాయించి రైతు

నాయకులను హత్యలు చేయించాలని విశ్వ ప్రయత్నాలు చేయించాడు. కాని రైతాంగంలోని ఐక్యత, కట్టుబాటు, అప్రమత్తత మొఖాసాదారు ఆటలు సాగనివ్వలేదు. తల్లవరం గ్రామం పోలవరానికి 9 మైళ్ళ దూరం. గోదావరి గట్టున గల గొప్ప ఏజెన్సీ ఏరియా. 90 ఎకరాలు రైతులు స్వాధీనం చేసుకున్నారు. సోమయ్య దొర రాజీకి అంగీకరించలేదు. అందుచే ఆ భూమి యిప్పటికి గ్రామ రైతులే అనుభవిస్తున్నారు.

1946 – 52 మధ్య జిల్లాలోని రైతుసంఘ కార్యకర్తల మీద ప్రభుత్వ నిర్బంధ విధానం ఘోరంగా సాగింది. కామ్రేడ్స్ దేవరకొండ సుబ్బారావు, ఈడ్పుగంటి పూర్ణచంద్రరావు, కలిదిండి సూర్యనారాయణరాజు, చించినాడ గ్రామానికి చెందిన గోపాలరాజు, ఆయనపురాజు, పడాల సుబ్బారావు మొదలగు రైతుసంఘ కార్యకర్తలను ప్రభుత్వం కాల్చి చంపింది.

కామ్రేడ్స్ గారపాటి సత్యనారాయణ, భూపతిరాజు లక్ష్మీనరసింహరాజు, అన్నే వెంకటేశ్వరరావు, కోటిపల్లి అమ్మన్న, వంకినేని సత్యనారాయణ, గొట్టుముక్కల వెంకట్రామరాజు, కృత్తివెంటి వెంకటేశ్వరరావు, కారుమూరి సత్యనారాయణ రెడ్డి, యాళ్ళబండి రంగనాయకులు మొదలగు రైతునాయకులను ప్రభుత్వం డిటైన్ చేసింది. ఉద్దరాజు రామం, సంకు అప్పారావు, యాళ్ళబండి పోలిశెట్టి మొదలగు రైతు కార్యకర్తలు రహస్యంగా ఉండి పనిచేయవలసి వచ్చింది. అనేకమంది రైతు కార్యకర్తలు కదలి పనిచేయటానికి వీలులేకుండా 1952 వరకు నిర్బంధ విధానం సాగింది.

1952 తర్వాత అంతకుముందు చిన్నాభిన్నమైన రైతు ఉద్యమాన్ని తిరిగి నిర్మించటం ప్రారంభించాం. కామ్రేడ్స్ భూపతిరాజు అధ్యక్షులుగా లక్ష్మినరసింహరాజు, అన్నె వెంకటేశ్వరరావు కార్యదర్శిగా జిల్లా కార్యవర్గంగా ఏర్పడి పనిచేయడం ప్రారంభించింది. రైతువర్కర్ల సమావేశాలు, తాలూకా రైతుసంఘ కమిటీలు ఏర్పడి పనిచేయడం మొదలుపెట్టింది.

1953లో గోదావరికి బ్రహ్మాండమైన వరద వచ్చింది. కట్టలు తెగిపోయే ప్రమాదం వచ్చింది. ఆ పరిస్థితిలో తణుకు కొవ్వూరు నర్సాపురం తాలూకాలలో రైతుసంఘ కార్యకర్తలు కట్టలు తెగకుండా ఆదర్శప్రాయమైన కృషిచేశారు. ఆ వరదలు సందర్భంలో నదిలో పశ్చిమ గోదావరి జిల్లా వైపు యిసుకమేటలు వేసి జిల్లాలో నీరు సమృద్ధిగా సప్లయి అగుటకు ఆటంకం ఏర్పడింది. దీనిమీద జిల్లా రైతు సంఘం వెంటనే కదిలి అధికారులకు మెమోరాండాలు యివ్వడం, కరపత్రాలు వేయడం జరిగింది. శబరి ఆనకట్టకొరకు రాజమండ్రిలో విభిన్న రాజకీయ అభిప్రాయాలు కలవారితో కలిసి ఒక మహాసభ జరిపాం.

## కొల్లేరు రైతుల సమస్య

ఈ జిల్లకు కొల్లేరు రైతుల సమస్య ముఖ్యమైనవాటిలో ఒకటి. ఏలూరు, భీమవరం, తాడేపల్లిగూడెం తాలూకాలు కొల్లేరు సరస్సును ఆనుకొని వున్నాయి. ఈ తాలూకాలలో సుమారు 35 వేల ఎకరాలు కొల్లేరు ఆన్ సర్వే భూములున్నాయి. యివి చాలా సారవంతమైనవి. భూస్వాములు ఈ ప్రభుత్వ భూములను కౌలుకు తీసుకొని పేదరైతాంగం చేసుకోకుండా అడ్డుపడి యింజన్లు పెట్టి అదే పేదరైతులతో వ్యవసాయం చేయించుకొనేవారు. భూస్వామి 6 పాళ్ళు తీసుకొని, చేసినవానికి 4 పాళ్ళు యిచ్చేవారు. ఒక్కొక్క భూస్వామి వెయ్యి ఎకరాలు కూడా కౌలుకు తీసుకొని యింజన్లు పెట్టి దోపిడీ సాగించేవాడు. ముఖ్యంగా ఏలూరు తాలూకాలో ఈ సమస్య తీసుకొని భూస్వాములతో తీవ్రంగా పోరాడి జిల్లా రైతుసంఘం, ముఖ్యంగా ఏలూరు తాలూకా రైతుసంఘం పండినపంట రైతులు, భూస్వాములు చెరిసగంగా పంచుకొనేటట్లు చేసింది. కొల్లేటిలో యింజన్లు పెట్టి వేసవికాలంలో రెండవపంటను వ్యవసాయం చేయించే ఈ భూస్వాములను ఇంజనుదారులని పిలిచేవారు. ఏలూరు తాలూకా జయపురం, శ్రీపర్రు, గుడివాక లంక, మోతేవారి లంకభూములు కొరకు స్థానిక రైతాంగం కొరకు రైతుసంఘం పోరాడింది. భూస్వాములకు కౌలుకివ్వడానికి వీలులేదని ఫీల్డు లేబర్ కోఆపరేటివ్ సొసైటీలు పెట్టి పేదరైతులను అందులో చేర్చి ఈ భూములివ్వాలని ఆందోళన చేశాం. స్వయంగా జిల్లా కలెక్టరుగారిని కొల్లేరు గ్రామాలకు తీసుకెళ్ళి ఆ గ్రామాలలోని ప్రజలు వరి అన్నం లేక అల్లిబికాయలు తినడం చూపించాం. గారపాటి చినకనకయ్య 500 ఎకరాలు కొల్లేటిలో ఆక్రమించి పేదలమీద దోపిడీ పెత్తనం సాగించేవాడు. యిట్లాంటి యింజన్‌దారులందరికి వ్యతిరేకంగా ఏలూరు తాలూకాలో పట్టువిడుపులు లేని పోరాటం సాగింది. కొల్లేరు రైతాంగం కొరకు రైతుసంఘం పనిచేస్తుందని చాలా ప్రబలంగా వచ్చింది. రైతుసంఘం చేసిన కృషి ఫలితంగా ప్రభుత్వం ఈ భూములు వ్యక్తులకు కౌలుకిచ్చే పద్ధతి మాని ఫీల్డు లేబర్ కో ఆపరేటివ్ సొసైటీలు ఏర్పాటుచేసుకొనిన పేదలకు ఈ భూములివ్వడం జరిగింది. అందుచే చాలావరకు ఏలూరు తాలూకాలో ఈ దోపిడి అరికట్టబడింది. తాడేపల్లిగూడెం తాలూకాలో మూర్తిరాజు గారు తనకున్న కాంగ్రెస్ అధికార బలాన్ని ఉపయోగించుకొని సుమారు 500 ఎకరాలు తన తండ్రి బాపిరాజు ధర్మసంస్థ పేర కౌలు సంపాదిం చగలిగారు. తాడేపల్లిగూడెం తాలూకా భూములలో దొంగ ఫీల్డు లేబర్ కో ఆపరేటివ్ సొసైటీలను ఏర్పాటుచేసి ఆ సంస్థలను తాను దోపిడీ చేయడం వాటిని అనేకరకాల అవినీతికి గురి చేశాడు. అందుచే ఆ సొసైటీలు చాలా గందరగోళంలో వున్నాయి.

పెదనింద్ర కొలను గ్రామంలోని పేదలు 150 మంది కో ఆపరేటివ్ ఫార్మింగు సొసైటీలను ఏర్పరుచుకొని 300 ఎకరాలు మూర్తిరాజుగారి ప్రమేయం లేకుండా తామే స్వంతంగా వ్యవసాయం చేసుకోవాలని ప్రయత్నించారు. ఆ సొసైటీ రిజిస్టరు అయ్యే తరుణంలో మూర్తిరాజు ముఖ్యమంత్రి నుండి స్టే ఆర్డరు తెచ్చారు. రైతులు ఆన్ సర్వే భూములు గాబుకోత కోస్తుండగా 600 మందిని పంపి దౌర్జన్యంగా ఆపుచేయించాలని ప్రయత్నించాడు. రైతులు తీవ్రంగా ప్రతిఘటించాలనే దానిని చూచి ఆ వచ్చినవారు తోకముడిచారు. ఆన్ సర్వే బోదెలు 800 మందితో ఫర్లాంగు పొడవున ఊడ్పించారు. పెద్ద ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పరస్పరం చంపుకొనే కొట్లాటలు జరిగే పరిస్థితులుండేసరికి జిల్లా రైతుసంఘం, కమ్యూనిస్టు నాయకత్వం జిల్లా కలెక్టర్‌ను, పోలీసు సూపరింటెండెంటును, డి.ఎస్.పి.ని, ఆర్.డి.వో.ను కలుసుకొని సకాలంలో ఆన్ సర్వే బోదె తిరిగి తెరిచేటట్లు చేశారు. ఈ ప్రయత్నం విఫలమయ్యాక పంట కోయించి తీసుకెళ్ళాలని ప్రయత్నించి విఫలమయ్యాడు. మొత్తం పంట రైతాంగానికి దక్కింది. ఈ సొసైటీ విజయం పొందితే తన కొల్లేరు దోపిడీ విధానం ఆగిపోతుందనే భయంతోనే మూర్తిరాజు ఈ పనులు చేశాడు. రైతు సంఘం, కమ్యూనిస్టు పార్టీ అండయుండుట వలన ఈ సొసైటీ మూర్తిరాజుకు వ్యతిరేకంగా ఆ ప్రాంతంలో నిలబడకలిగింది.

గోపవరం హరిజనులు అనాదిగా చేసుకుంటున్న భూములను ఫీల్డు లేబర్ కో ఆపరేటివ్ సొసైటీలు పెట్టించి గోపవరం గ్రామానికి చెందనివారితో ఆ భూములు సాగుచేయించి మూర్తిరాజు దోపిడీ సాగిస్తుంటే గోపవరం హరిజనులు యిప్పటికి మూర్తిరాజును ప్రతిఘటిస్తూనే యున్నారు.

1946లో కొల్లేరు ముంపు వచ్చినప్పుడు పశ్చిమగోదావరి జిల్లా, కృష్ణా జిల్లా రైతులతో కలిసి ఆకివీడులో పెద్దసభ జరిపి కొల్లేరు రైతుల రిలీఫ్ కొరకు పెద్ద ఆందోళన జిల్లా రైతుసంఘం చేసింది. తరువాత కాలంలో కూడా అనేక పర్యాయాలు వరదలు వచ్చినప్పుడు గాలివానలు వచ్చినప్పుడు జిల్లా రైతుసంఘం కొల్లేరు రైతుల కొరకు కృషి చేసింది. రైతు సంఘాలు యితర ప్రజాసంఘాల, ప్రజానాయకుల ఆందోళన వలనే యిప్పుడు కొల్లేటిలో ప్రభుత్వం నూతనమైన అభివృద్ధి స్కీమును పెట్టబోవుచున్నది.

తణుకులో పంచదార మిల్లు యజమాని ముళ్ళపూడి హరిశ్చంద్ర ప్రసాద్ చెరకు రైతులకు న్యాయంగా సూత్రం ప్రకారం యివ్వవలసిన అదనపు సొమ్ము సిస్మా యివ్వలేదు. సిస్మా అమలు కొరకు ఆందోళన చేశాం. రాష్ట్ర చెరకు ఉత్పత్తి దారుల సభ తణుకులోజరిగింది. ఈ కృషి ఫలితంగా మొత్తం సిస్మా అంతా యివ్వకపోయినా టన్నుకు రూ. 21/2 లు యివ్వటానికి యజమానులు అంగీకరించేటట్టు చేశాం.

ఆ రోజలలోనే బెల్లం రైతులను మొదటి అమ్మకందారుగా భావించి ప్రభుత్వం రైతుల దగ్గర బెల్లం మీద పన్ను వసూలు చేసింది. ఈ చర్య రైతాంగంలో తీవ్ర అసంతృప్తి కలుగజేసింది. తణుకు తాలూకా రైతు సంఘ కార్యకర్తలను కాంగ్రెసువాదులను కమ్యూనిస్టులను కలుపుకొని బెల్లం ఉత్పత్తిదారుల మహాసభను జరిపారు. రాయబార కమిటీ ఏర్పడి మంత్రుల వద్దకు రాయబారం వెళ్ళింది. ఈ ఆందోళన ఫలితంగా లైసెనుసలు కట్టనవసరం లేదని చెప్పి ప్రభుత్వం టాక్సును తాత్కాలికంగా ఆపుచేసింది.

1954 పుగాకు ధర విపరీతంగా పడిపోయింది. దీనిమీద కొవ్వూరు తాలూకా ఎర్నగూడెం గ్రామంలో జిల్లా నాటు పుగాకు రైతుల మహాసభ జరిపి ఢిల్లీకి రాయబారం వెళ్ళటం జరిగింది. రైతులకు న్యాయమైన ధర వచ్చేలాగా ప్రభుత్వం చేయాలని వెంటనే పన్ను తగ్గించి రైతులకు రిలీఫ్ కలుగ చేయాలని ప్రభుత్వానికి తెలియచేశాం. రైతులకు కొంతవరకు పన్ను తగ్గించారు. చింతలపూడి తాలూకాలో కూడా ఒక సభ జరిపి రైతుల కొరకు కృషిచేశాము.

1954లో కర్నూలుకు జరిగిన రైతుయాత్రలో జనాన్ని సమీకరించి జిల్లాలో విరివిగా ప్రచారం చేసి కర్నూలుకు పంపించాం.

1952 నుండి 54 వరకు జిల్లాలో జరిగిన అన్ని రైతు సమస్యలలోను ఆ రోజున శాసనసభ్యులుగా యున్న కామ్రేడ్ భూపతిరాజు లక్ష్మీనరసరాజు, గారపాటి సత్యనారాయణ, పిన్నమనేని రామచంద్రరావు, మొటపరి కూనేరావు గార్లు బాగా తోడ్పడ్డారు.

వీరు దాళ్వా పంట విషయంలో జరుగుతున్న అక్రమాలను వ్యతిరేకించారు. అదనపు దాళ్వా యిస్తూ రొటేషన్ రైతులకు జరుగుతున్న అక్రమాలకు వ్యతిరేకంగా జిల్లా రైతుసంఘం జరిపిన కృషికి తోడ్పడ్డారు. ఆకివీడు ఫిర్కాలో దాళ్వా పంటకు ముందుగానే పన్నులు వసూలు చేసే పద్ధతి వుండేది. దానిని మాన్పించారు.

### గోదావరి డెల్టా లోకలైజేషన్ స్కీమ్

మన జిల్లాలో గోదావరి డెల్టా నుండి 5 లక్షలు ఎకరాలకు పైగా సాగుచున్నది. ఈ భూములకు గొప్ప నీటివనరులు కలిగి రాష్ట్రానికి కేంద్రానికి కూడా ధాన్యం సప్లయిచేసే ధాన్యాగారంగా మన జిల్లా కూడా యున్నది. ఈ భూములకు రెండవ పంటకు నీరు యిచ్చి వ్యవసాయం చేయించడం ఒక కీలకసమస్యగా వుంటూ యున్నది. ప్రభుత్వం చట్టబద్ధంగా ఏర్పాటుచేసిన రెండవ పంట భూములు గాక మరికొన్ని భూములను నది నుండి నీరు సరఫరా చేసే అవకాశం యున్నా దానికి యొక పద్ధతి లేక అధికారుల లంచగొండితనానికి అవినీతిపరులైన

రాజకీయవేత్తల దోపిడీలకు ఈ సమస్య జిల్లాలో కీలకంగా తయారైంది. అందుచేత నదిలో అదనంగా యున్న నీటిని సక్రమంగా ఒక పద్ధతి ప్రకారంగా భూములకు సప్లయి చేయాలని ఆందోళన చేశాం. అప్పుడే పి.డబ్ల్యు. డి. అధికారుల ఆట కట్టించగలమని రైతుసంఘం గట్టి కృషిచేసింది. జిల్లా రైతుసంఘం కాంగ్రెస్ కమ్యూనిస్టు పార్టీలలోని ప్రజాస్వామ్యవాదుల కృషి ఫలితంగా లోకలైజేషన్ స్కీమ్ ప్రభుత్వంచే అమలు జరిపించాం. దీనికిముందు డెల్టాలో బయనీలు సిస్టం ఉండేది గాదు. లోకలైజేషన్ స్కీమ్‌తో బయనీలు సిస్టం కూడా అమలు లోకి వచ్చి ఎక్కువ భూములకు పద్ధతి ప్రకారం నీరు సరఫరా జరుగుచున్నది. దీనివలన రైతాంగానికి చాలా మేలు జరుగుచున్నది.

## ఈనాం రైతుల సమస్య

రైతుసంఘం తరపున కామ్రేడ్ యిందుకూరి సుబ్బరాజు ఈనాం రైతులలో ప్రత్యేక కృషిచేసి మహాసభ జరిపారు. తాడేపల్లిగూడెం తాలూకాలో ఈనాం రైతుల యాత్ర జరిగింది. జిల్లా అంతటా ఈనాం గ్రామాలకు మహజర్లు అచ్చువేయించి ఈనాం రైతులచే సంతకాలు చేయించి ఆందోళన చేశారు. సుబ్బరాజుగారు ఈనాం రైతులను సమీకరించిబీ కళా వెంకట్రావు గారి నాయకత్వాన సెలెక్టు కమిటీ వచ్చినప్పుడు విజయనగరం వెళ్ళి మెమోరాండం ఇప్పించారు. బిల్లు పాసైన తరువాత రైతుసంఘం దానిని వినియోగించడం పైన కేంద్రీకరించలేకపోయింది.

## కౌలుదారీ సమస్య

1940 ప్రాంతంలో భీమవరం తాలూకా మెంటేపూడి గ్రామ కౌలుదారీ రైతుల పోరాటానికి జిల్లా రైతుసంఘం నాయకత్వం వహించి నడిపింది. ఆ గ్రామంలోని 450 ఎకరాలకు 35 ఎకరాలు మాత్రం ఆ గ్రామస్తులది. పొరుగూరి భూస్వాములు హెచ్చు కౌలురేటుతో విపరీతంగా రైతులను దోపిడీచేసేవారు. పోలిశెట్టి వీరాస్వామియనే పొరుగూరి భూస్వామి అధిక వడ్డీరేట్లతో, నాములతో, వెట్టికూడా చేయించుకుంటూ పేదలను విపరీతంగా దోపిడీ చేసేవాడు. చిన్నరైతులు అధిక కౌళ్ళకు భూస్వాముల భూములు చేసి ఉన్న భూములు పోగొట్టుకున్నారు. రైతులు సాగుచేసిన భూములు భూస్వాములు పంటతో సహితంగా యితరులకు అమ్మబోగా రైతులు తమ కౌలువాటా కోసం ప్రతిఘటించారు. భూస్వామి కోర్టువారితో రిసీవర్ వేయించినా రైతులే పంటను కోసుకున్నారు. ఈ పోరాటం క్రమేపి రైతాంగానికి మేలు కలిగించింది. ఈ పోరాటంలో భూస్వామి 75 మందిని అరెస్టు చేయించాడు. ఈ పోరాటానికి యాళ్ళబండి పోలిసెట్టి, కొల్లా వెంకటరత్నం, బోడపాటి నాయుడు, కొల్లా సూర్యారావు నాయకత్వం వహించారు. కొవ్వూరు తాలూకా తాడిమెళ్ళ గ్రామంలో భూస్వాములు రైతుల దగ్గర 2/3 వంతు పాలు తీసుకునేవారు. 1954 – 55 లలో రైతుసంఘం రైతులను ఐక్యపరచి 400 ఎకరాల భూస్వామికి వ్యతిరేకంగా పోరాటం చేశారు. కామ్రేడ్స్ మారెళ్ళ నరసింహారావు, మద్దుకూరి నారాయణ ఈ పోరాటానికి నాయకత్వం వహించారు. ఈ ఉద్యమం జయప్రదమై భూస్వామికి 2 పాళ్ళు రైతులకు ఒక పాలు వున్న కౌలురేటు చెరిసగంగా భూస్వాములు ఆమోదించారు.

జిల్లా రైతుసంఘం ఈ విషయంలో మొదటినుంచి ప్రత్యేక శ్రద్ధ వహించి ఆందోళన చేసింది. చట్టం రావటంతోనే దాని మంచిచెడ్డలు చర్చించి తాలూకాలకు సూచనలు చేసింది. ఏలూరు, తణుకు, నర్సాపురం, గూడెం తాలూకాలలో కరపత్రాలు ప్రకటించి కౌలుదారులచేత దరఖాస్తులు పెట్టించారు. ఈ సమస్య మీద ఏలూరు తాలూకాలో ఉద్యమరూపం తీసుకుంది. ఏలూరు తాలూకాలో కౌలుదార్ల మహాసభ జరిపి ఏలూరు లైబ్రరీహాలులో రెండువేలమంది ప్రముఖులతో పెద్ద మీటింగు పెట్టారు.

ఈ సభకు 18 గ్రామాల నుండి రైతులు వచ్చారు. మహాసభకు మూల్పూరు రంగయ్య యం.ఎల్.ఎ. కృష్ణావతారం, యం.ఎల్.ఎ. మల్లిపూడి రాజేశ్వరరావు యం.ఎల్.ఎ. కామ్రేడ్స్ కోండ్రు సుబ్బారావు, గారపాటి సత్యనారాయణ, అన్నే వెంకటేశ్వరరావు, పులపర్తి విజయసారథి, తేతల పోతరాజు మొదలగు ముఖ్యులు హాజరయ్యారు. కౌలుదార్ల పక్షాన ప్లీడర్లను పెట్టి కోర్టులో రైతుసంఘం వాదించింది. భూస్వాముల యాక్టు ప్రకారం కౌలు తీసుకోకుండా నిరాకరిస్తే గ్రామాధికారులకు తాసీల్దారులకు కౌలుధాన్యం అప్పజెప్పారు. రైతుసంఘం ఆందోళన వలన రైతులకు న్యాయం కలిగి రైతాంగంలో ఉత్సాహం, సంఘం అంటే ఆత్మవిశ్వాసం కలిగింది. మిగతా తాలూకాలలో కొన్ని సందర్భాలలో రాజీచేయడం ద్వారానూ, కోర్టులలో మన లాయర్సు సహకారంతో కౌలుదారుల హక్కులు కాపాడుటకోసం కృషిచేశాం.

## గురజ జమీందారుకు వ్యతిరేకంగా పోరాటం

తణుకు తాలూకా వేలివెన్ను గ్రామంలో గొప్ప సారవంతమైన చెరువు భూములు సుమారు – ఎకరాలు గురజ జమీందారు తన స్వంతమని వాటిని అమ్మకోటానికి ప్రయత్నించగా గ్రామ రైతుసంఘం, జిల్లా రైతుసంఘం సాయంతో దానిని వ్యతిరేకించటం జరిగింది. జమీందారుకు భూములు చాలాకాలం స్వాధీనం కానివ్వలేదు. జమీందారు కోర్టుకు వెళ్ళి గెల్చిన తర్వాత ఉద్యమం తగ్గిపోయింది. జమీందారు భూములు అమ్ముకొన్నాడు.

## జీడిగుంట లంక పోరాటం

కొవ్వూరు తాలూకా జీడిగుంట గ్రామానికి గోదావరి లంకలో 150 ఎకరాల సారవంతమైన భూమి వున్నది. ఈ భూమి నూజివీడు జమీందారులది. పెండ్యాల గ్రామానికి చెందిన అప్పలరాజు అనే జమీందారు ఏజెంటు స్థానిక అధికారులను లోబరుచుకొని జీడిగుంట – పెండ్యాల లంకలు ఆక్రమించుకొని కొంత సాగుచేస్తూ, కొంత గయాళిగా ఉంచాడు. జీడిగుంట గ్రామప్రజలు – పెండ్యాల రైతులు కొత్తగా బయలుదేరిన ఈ లంకలు అప్పలరాజు కాజేయటం వ్యతిరేకించారు. జీడిగుంట లంక జమీందారుది కాదని, గవర్నమెంటు దానిని బీదలకు సాగుకివ్వాలని అధికారులకు పిటిషన్లు పెట్టించాం. రైతుసంఘ కార్యకర్తలు 2 నెలలు అక్కడ వుండి జమీందారు ఏజెంటుకు భూములు స్వాధీనం కాకుండా చేసి, బీద ప్రజలకు పంట దక్కేట్లు చేశారు. తర్వాత అప్పలరాజు 144 సెక్షను ద్వారా బీద రైతులను వెళ్ళగొట్టి పొగాకుపంట కాజెయ్యాలనే ప్రయత్నాలు రైతుసంఘం సాగనివ్వలేదు. రెవిన్యూబోర్డు వరకు ఈ సమస్య తీసుకువెళ్ళి ప్రభుత్వ యంత్రాంగాన్ని కదిపాం. ఈ పోరాటం 1953 నుండి 58 వరకు సాగింది. నాలుగు సంవత్సరాలూ పూర్తిగా పంటలు పేదలు పండించుకున్నారు. 30 మంది జీడిగుంట గ్రామ హరిజన స్త్రీ పురుషులపై కేసులు పెట్టి కోర్టులవెంట తిప్పారు. కోర్టు జమీందారుకు అనుకూలంగా తీర్పుచెప్పటం వల్ల ఉద్యమం తగ్గిపోయింది. ఈ ఉద్యమాన్ని ప్రధానంగా మారెళ్ళ నరశింహారావు, చేకూరి భద్రిరాజు, వంకా సత్యనారాయణ, ఎస్.ఆర్.దాట్ల నడిపారు.

చింతలపూడి తాలూకాలో సారవంతమైన 40 ఎకరాల బంజరుభూమి మల్లేశ్వరం హరిజనులకు దక్కేటట్లు కృషిచేశాం. ఎర్రగుంటపల్లి 80 ఎకరాలు, ప్రగడవరం 200 ఎకరాలు బంజరుభూములు పేదలకు ఇప్పించాం.

## భూసంస్కరణల గురించి ఆందోళన

1958లో బూటకపు భూసంస్కరణల గురించి రైతుసంఘ నాయకత్వాన తాడేపల్లిగూడెం, ఏలూరు తాలూకా గ్రామాల్లో బహిరంగసభలు, గ్రూపు మీటింగులతో ప్రచారం చేశాం. తాడేపల్లిగూడెం తాలూకాలో ఆరుగురితో కూడిన పాదయాత్రాదళం ప్రచారం చేసింది. ఏలూరు తాలూకాలో అన్నె వెంకటేశ్వరరావు, కట్నే నికాశీల నాయకత్వాన ఒకదళం గ్రామాల్లో ప్రచారం చేసింది. మిగతా తాలూకాల్లో భూసంస్కరనల మహజర్ల మీద సంతకాలు సేకరించారు.

తిరిగి 1960 సంవత్సరంలో భూసంస్కరణల గురించి రాష్ట్రవ్యాపితంగా ఒక వారం రోజులు ఆందోళన చెయ్యటం జరిగింది. నర్సాపురం తాలూకాలో రెండుదళాలు, ఏలూరు, తాడేపల్లిగూడెం, చింతలపూడి తాలూకాల్లో ఒక్కొక్క దళం ప్రచారం చేసినవి. ప్రచారం చేసిన కార్యకర్తల్లో భూసంస్కరణల యెడల ప్రజల ఆసక్తి చూసి మంచి ఉత్సాహం వచ్చింది. భీమవరం, తణుకు తాలూకాల్లో కొన్ని మీటింగులు పెట్టారు తప్ప దళ ప్రచారం సాగలేదు.

## అదనపు శిస్తు చట్టానికి వ్యతిరేక పోరాటం

1962 జూన్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతాంగం మీద రూపాయికి రూపాయి పన్ను పెంచుతూ ఆర్డినెన్స్ ప్రకటించింది. దీనికి వ్యతిరేకంగా రైతాంగంలో పెద్ద సంచలనం వచ్చి రాష్ట్రం మొత్తంగా పెద్ద ఆందోళన జరిగింది. జిల్లా, రాష్ట్ర రైతుసంఘాలు ఈ ఉద్యమానికి నాయకత్వం వహించినవి. ఈ ఉద్యమంలో మన జిల్లా రైతాంగం పార్టీ విబేధాలు లేకుండా అగ్రశ్రేణిలో ఉండి పోరాడింది. తాలూకాలలో అఖిలపక్ష తాలూకా సదస్సులు జరిగినవి. తాడేపల్లిగూడెంలో జిల్లా అఖిలపక్ష సభ జరిగి, జిల్లా అఖిలపక్ష రైతుసంఘం ఏర్పడింది. దీనికి భీమవరం తాలూకా వాస్తవ్యులు జాతీయ ఉద్యమంలో కాకలు తీరిన కాంగ్రెస్‌వాది శ్రీ భూపతిరాజు రామమూర్తిరాజు అధ్యక్షులుగాను, ఏలూరు తాలూకా కాంగ్రెసు వాది భోగరాజు పేర్రాజుగారు కార్యదర్శిగాను ఉన్నారు. కామ్రేడ్స్ సంకు అప్పారావు, ఇందుకూరి సుబ్బరాజు, అన్నె వెంకటేశ్వరరావు, యాళ్లబండి పోలిసెట్టి, కారుమూడి సత్యనారాయణరెడ్డి గారు కమిటీలో ఉన్నారు. మనజిల్లాలో ప్రముఖ కాంగ్రెసువాది భూపతిరాజు సుబ్బరాజుగారు ఈ ఉద్యమానికి అన్నివిధాలా సహాయపడ్డారు.

1962లో జూలైలో హైదరాబాదులో జరిగిన రైతు ప్రదర్శనకు జిల్లా నుండి 500 మంది రైతాంగాన్ని సమీకరించాం. జిల్లాలోని రైతుసంఘ కార్యకర్తలతో బాటు ఊరేగింపులో శ్రీయుతలు రామమూర్తిరాజు గారు, సుబ్బతాతరాజు గారు మరికొంతమంది కాంగ్రెసువారు తమ జెండాలతో పాల్గొన్నారు.

అదనపు భూమిశిస్తుకు వ్యతిరేకంగా వచ్చిన అసంతృప్తిని ప్రభుత్వం లెక్కచేయనందున అదనపు భూమిశిస్తు రద్దుకు – బంజర్లకు పట్టాలివ్వాలని, ఆంధ్రప్రదేశ్‌లో పెద్దఎత్తున నిర్వహించబడిన రైతు సత్యాగ్రహంలో మన జిల్లా అగ్రశ్రేణిలో తనపాత్ర నిర్వహించింది. సత్యాగ్రహానికి ముందు జిల్లాలోని అన్ని తాలూకాలలోనూ అనేక గ్రామాల్లో మీటింగులు పెట్టాం. తాలూకాల్లో సైకిలుమీద తిరిగి దళాలు ప్రచారం సాగించాయి.

జిల్లాదళం ఒకటి సైకిళ్ళమీద ఏలూరు నుండి బయలుదేరి తాలూకాలు తిరిగి – తిరిగి ఏలూరు చేరాలని నిర్ణయించుకుంది. అనుకున్న ప్రకారం దళం బయలుదేరింది. దళంలో కామ్రేడ్ అప్పారావు, కామ్రేడ్ నెక్కలపూడి రామారావు – ప్రత్తి శేషయ్యగారు మొదలుపెట్టినది మొదలు చివరివరకూ ఉన్నారు. ఆయా తాలూకాల్లో దళం పర్యటించినపుడు గొప్ప ఉత్సాహంతో స్థానిక కామ్రేడ్స్ ఇతరులు వచ్చి ప్రచారంలోనూ పర్యటనలోనూ

పాల్గొన్నారు. ఈ దళం 6 తాలూకాలలో 9 రోజులు పర్యటనలో అనేక బహిరంగసభలు పెట్టి మొత్తం 260 మైళ్ళు జయప్రదంగా పర్యటన చేయటం జరిగింది. ఈ పర్యటన గ్రామాల్లోని రైతుల్లో, వ్యవసాయ కార్మికుల్లో రైతుసంఘ కార్యకర్తల్లో గొప్ప ఉత్సాహాన్ని, ఉద్రేకాన్ని కలిగించింది.

ప్రదేశ్ అఖిలపక్ష కార్యాచరణ సంఘనాయకులు కామ్రేడ్ వై.వి. కృష్ణారావు శ్రీ తెన్నేటి విశ్వనాథం, శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య గార్లు నర్సాపురం, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, కొవ్వూరు, చింతలపూడి తాలూకాల్లో పర్యటనలు చేసి బహిరంగసభలు పెట్టి పెద్ద ఉత్సాహాన్ని కలుగజేశారు. సత్యాగ్రహం చేయుటకు ముందు తాడేపల్లిగూడెంలో జిల్లా అఖిలపక్ష రైతుసంఘ కార్యకర్తల సమావేశం వేశాం. ఈ సమావేశానికి పై ముగ్గురు నాయకులు హాజరైరి. మొత్తం జిల్లా రైతుసంఘం కార్యకర్తల్లో పెద్ద ఉత్సాహాన్ని కలుగజేసారు.

1964 ఫిబ్రవరి 10వ తేదీ నాటి నుండి మార్చి నెలాఖరు వరకు సత్యాగ్రహం జరిగింది. ఈ సత్యాగ్రహంలో కాంగ్రెస్, కమ్యూనిస్టు విబేధాలు లేకుండా గ్రామాల్లోని రైతులందరూ పెద్దఎత్తున గ్రామంలో ఉన్న ఎడ్లబండ్లతో సహా తాలూకా ఆఫీసులకు వచ్చి సత్యాగ్రహంలో పాల్గొన్నారు. ఈ ఉద్యమం నిర్వహణలో భీమవరం తాలూకాలో రైతుసంఘంతో బాటు, కాంగ్రెసువారు కూడా పెద్దఎత్తున నాయకత్వం వహించారు. శ్రీ భూపతిరాజు రామమూర్తిరాజు గారు, శ్రీ భూపతిరాజు విజయకుమారరాజు, (వీరి తండ్రిగారైన సుబ్బతాతరాజు గారు ఈ కాలంలో స్వర్గస్తులైనారు) శ్రీ ముదిండి సత్యనారాయణరాజు గారు (పెదమిరం మున్సబు) తాలూకా రైతుసంఘ నాయకులతో గూడ కలిసి సత్యాగ్రమానికి నాయకత్వం వహించారు. భీమవరం తాలూకాలో 950 మంది సత్యాగ్రహం చేశారు.

జిల్లాలో సత్యాగ్రహ ఉద్యమంలో అగ్రస్థానం తాడేపల్లిగూడెం తాలూకాది. ఈ తాలూకాలో గూడా అత్యధిక సంఖ్యలో కాంగ్రెసువాదులు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. ఈ తాలూకా ఉద్యమప్రభావం మన జిల్లాలోనే కాకుండా ఇతర జిల్లాలమీద గూడా పడింది. సత్యాగ్రహంలో 3200 మంది పాల్గొన్నారు. 30 మంది అరెస్టు అయినారు. ఇందులో కొందరు శిక్షింపబడ్డారు.

చింతలపూడి తాలూకాలో 1760 మంది సత్యాగ్రహం చేశారు. ఇందులో బంజరు సాగుదార్లు, వ్యవసాయ కార్మికులు వున్నారు. తాలూకాలో ఈ సత్యాగ్రహం పెద్ద కదలిక తెచ్చింది. 49 మందికి శిక్ష విధించారు. తణుకు తాలూకాలో కొంతమంది కాంగ్రెసువాదులు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. కమ్యూనిస్టు పార్టీ గ్రామాల్లోని రైతాంగమే ఎక్కువగా కదిలింది. 1000 మంది సత్యాగ్రహం చేశారు. 30 మందికి శిక్ష వేశారు.

నర్సాపురం తాలూకాలో రైతు కార్యకర్తలు వ్యవసాయ కార్మికులు ప్రధానంగా పాల్గొన్నారు. కాంగ్రెసువాదులు అంతగా కదల్లేదు. 995 మంది సత్యాగ్రహంలో పాల్గొన్నారు. 48 మందికి శిక్ష వేశారు.

పోలవరం తాలూకాలో 500 మంది, ఏలూరు తాలూకాలో 400 మంది, కొవ్వూరు తాలూకాలో 292 మంది, సత్యాగ్రహం చేశారు. 200 మంది స్త్రీలు జిల్లా సత్యాగ్రహంలో ఉన్నారు. అన్ని తాలూకాలూ తిరిగి రైతుసంఘ కార్యకర్తల్ని కదిలిస్తూ కామ్రేడ్ సంకు అప్పారావు మొత్తం ఉద్యమాన్ని కో - ఆర్డినేట్ చేశారు.

సత్యాగ్రహం తరువాత జరిగిన హర్తాళ్‌లో ఏలూరు, తణుకు మొదలగు పట్నాలు పాల్గొన్నాయి.

చివరకు ఈ ఉద్యమం ఆగిపోవడానికి, ఫలితాలు రాకపోవడానికి కమ్యూనిస్టు పార్టీ నుంచి చీలిపోయి నేడు మార్క్సిస్టు పార్టీగా పిలవబడుతున్న పార్టీ నాయకులు కొందరు కారణం. హైదరాబాదులో జరిగిన అఖిలపక్ష కార్యకర్తల సమావేశంలో ఉద్యమాన్ని విరమించాలని వీరు పట్టుపట్టారు.

కమ్యూనిస్టు ఉద్యమంలో వచ్చిన చీలికలు రైతు ఉద్యమంలో గూడా వచ్చినవి. కమ్యూనిస్టు పార్టీ నుంచి చీలిపోయిన కామ్రేడ్స్ ఐక్య రైతు ఉద్యమానికి సహకరించలేదు. అప్పటి జిల్లా రైతు సంఘ అధ్యక్షులుగా ఉన్న శ్రీ భూపతిరాజు లక్ష్మీనరసరాజు గారు రాజకీయాల నుండి నిష్క్రమించారు. కార్యదర్శి అయిన కామ్రేడ్ అన్నే వెంకటేశ్వరరావు గారు జైలులో ఉన్నారు. అందుచే జిల్లా రైతుసంఘాన్ని పునర్నిర్మాణం చెయ్యాల్సి వచ్చింది. దీనికొరకు 1966 ఫిబ్రవరి 12వ తేదీన తాడేపల్లిగూడెంలో జిల్లా రైతుసదస్సు జరిగింది. ఈ సమావేశానికి గతంలో రైతు కార్యకర్తలుగా ఉన్న మార్క్సిస్టు పార్టీ వారిని ఆహ్వానించినా వారు రాలేదు. అయినా వారిలో నలుగుర్ని కార్యవర్గంలో కో-ఆప్ట్ చేసుకోవాలని నిర్ణయించి ఖాళీలు అట్టిపెట్టటం జరిగింది. ఆ తర్వాత గూడా చాలా సందర్భాల్లో మార్క్సిస్టు పార్టీ వారితో ఐక్య రైతు ఉద్యమ ఆవశ్యకత గురించి చెప్పి కలిసి పనిచెయ్యాలన్నా అఖిలభారతంగా వారు తీసుకొన్న ప్రజాసంఘాలను విచ్ఛిన్నం చేసే పద్ధతి వల్ల కలిసి రాలేదు.

1966 ఫిబ్రవరి 23, 24, 25 తేదీలలో నాల్గవ ప్రదేశ్ రైతు మహాసభ తాడేపల్లిగూడెంలో ప్రత్యేకంగా నిర్మించిన రైతునగర్‌లో బ్రహ్మాండంగా జరిగింది. ఈ మహాసభకు జిల్లాలోని కాంగ్రెస్‌వాదులు గూడా పెద్దఎత్తున నిర్వహణలోనూ ఆర్థికంగానూ సహాయపడ్డారు. ఆహ్వానసంఘ అధ్యక్షులు ఈ మహాసభకు జిల్లాలోని ప్రముఖ జాతీయనాయకులైన శ్రీ భూపతిరాజు రామమూర్తిరాజుగారు, ఆంధ్రరాష్ట్ర రైతు ఉద్యమ నిర్మాత కీ.శే. కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి, పశ్చిమ

గోదావరి జిల్లా జాతీయోద్యమ ప్రముఖులు, రైతు నాయకులు కీ.శే. దండు నారాయణరాజు, 1948 – 50 నిర్బంధకాండలో పోలీసుల హింసాకృత్యాలకు బలియైన అమరవీరుడు కలిదిండి సూర్యానారాయణ రాజు, కానూరు, పెండ్యాల లంకల రైతు పోరాటాలకు నాయకత్వం వహించి 1950లో పోలీసుల కాల్పుల్లో మరణించిన అమరవీరుడు దేవరకొండ సుబ్బారావు గార్ల పేరిట నాలుగు ద్వారాలు ఏర్పాటు చెయ్యబడ్డాయి. పాకిస్తాన్ దురాక్రమణ తిప్పికొట్టడానికి వీరోచితంగా పోరాడి ఆత్మ బలిదానం చేసిన అబ్దుల్ హమీద్ పేర ప్రతినిధుల హాలు నిర్మించబడింది.

జిల్లాలో మహాసభ ముందు పెద్దఎత్తున ప్రచారం చేశాం. ఈ మహాసభ సందర్భంలో పశు ప్రదర్శనా పోటీలు ఏర్పాటు చెయ్యబడ్డాయి. వీటికి 50 వేల మంది హాజరయ్యారు. మహాసభ ఆవరణలో వ్యవసాయశాఖ వారు, పశుసంరక్షణ వారు తమ తమ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శన చూడటానికి రోజూ వేలమంది రైతులు వచ్చేవారు. మహాసభ ఆఖరు రోజున జరిగిన బ్రహ్మాండమైన బహిరంగసభకు 70 వేలమంది ప్రజలు హాజరైనారు. ఈ సభలో పాకిస్తాన్ దాడిలో అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించి, పాక్ విమానాలను అతినేర్పుతో కూల్చివేసిన సుబేదార్ రామభద్రరాజును సన్మానించటం జరిగింది. ఈ మహాసభకు ప్రజాపార్టీ అధ్యక్షులు శ్రీ తెన్నేటి విశ్వనాథం గారు, సర్వోదయ నాయకులు శ్రీ గెడ్డం సన్యాసిరావు గారు, సోషలిస్టు పార్టీ తరపున శ్రీ తుమ్మల చౌదరిగారు, జిల్లా కాంగ్రెసు నాయకులు శ్రీ గెడా రఘునాయకులు గారు రిపబ్లికన్ పార్టీ తరపున శ్రీ అరుణ్‌కుమార్ గారు, ప్రదేశ్ కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ నీలం రాజశేఖర రెడ్డి గారు హాజరైనారు. ఈ ఐక్య రాజకీయ వాతావరణం జిల్లాలో మంచి ఉత్సాహాన్ని కలిగించింది.

1966వ సంవత్సరం రెండవ పంటకు గోదావరిలో నీటి కెపాసిటీకి మించి పి.డబ్ల్యు.డి. అధికారులు లంచాలు పుచ్చుకొని ఎం.ఎల్.ఎ. ఒత్తిడికి లొంగి అదనపు దాళ్వా, ప్లాంటేషన్లకు ప్రభుత్వ అధికారులు అనుమతి యిచ్చారు. దీనితో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడి నక్కుం దెబ్బతిన్నది. ఈ సమస్య మీద జిల్లా రైతుసంఘం పి.డబ్ల్యు.డి. అధికార్లను కల్సుకొని మెయిన్ కాల్వలోని యింజన్లను తీసివేయించటంలోనూ, రొటేషన్ ఏర్పాటుకల నీరు సప్లై చేయడంలోనూ కృషి చెయ్యటం జరిగింది. రెండవపంట దెబ్బతిన్న భూములను మన ఆందోళన ఫలితంగా ప్రభుత్వం శిస్తు రెమిషన్ ఇచ్చింది. 1966 లోని అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని 67లో దాళ్వా యివ్వటంలో అవకతవకలు జరగకుండా రైతుసంఘం నివారించింది.

గోదావరి బ్యారేజిని త్వరగా నిర్మించాల్సిన అవసరం గూర్చి ధవళేశ్వరంలో సభ జరిగింది. మంత్రి శ్రీ ఎ.సి. సుబ్బారెడ్డి గారు హాజరైనారు. జిల్లా రైతు సంఘ ప్రతినిధులు సమావేశానికి వెళ్ళి మనవైఖరి వివరించి ఆనకట్ట ప్రమాదం దృష్ట్యా సత్వర బ్యారేజి నిర్మాణం జరిగేందుకు రైతాంగం నించి కంట్రిబ్యూషన్ ప్రభుత్వం తీసుకోటానికి అంగీకరించాం.

**గోదావరి బ్యారేజిని త్వరగా నిర్మించాల్సిన అవసరం గూర్చి ధవళేశ్వరంలో సభ జరిగింది. మంత్రి శ్రీ ఎ.సి. సుబ్బారెడ్డి గారు హాజరైనారు. జిల్లా రైతు సంఘ ప్రతినిధులు సమావేశానికి వెళ్ళి మనవైఖరి వివరించి ఆనకట్ట ప్రమాదం దృష్ట్యా సత్వర బ్యారేజి నిర్మాణం జరిగేందుకు రైతాంగం నించి కంట్రిబ్యూషన్ ప్రభుత్వం తీసుకోటానికి అంగీకరించాం.**

1956 సంవత్సరంలో 200 లీటర్ల క్రూడాయిల్ పీపా కంట్రోల్ ధర 85 రూపాయలు ఉంటే 150 రూపాయలకు బ్లాక్ మార్కెట్ రేటున వర్తకులు అమ్మారు. దీనిమీద జిల్లాలో పెద్ద ఆందోళన చేశారు.

వరిచేలకు తప్ప అరటితోటలకు, వంగతోటలకు అమ్మోనియా ఇవ్వరాదని వ్యవసాయశాఖ మంత్రి ఇచ్చిన ఆర్డర్ ఉపసంహరించుకోవాలని, జిల్లాలో ఆందోళన చేసి మంత్రిగారి వద్దకు రాయబారం వెళ్లి ఆర్డర్ ఉపసంహరించుకొనేటట్లు చేశాం. పెండ్యాల పంపింగ్ స్కీమ్ కింద సాగయ్యే 6 వేల ఎకరాలకు నీరు వదలలేదు. ఎకరంకు 40 రూపాయలు ఇంజన్ వర్కింగ్ ఛార్జి క్రింద రైతాంగం డబ్బు కట్టాలని పట్టుబట్టారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్‌ను కలుసుకొని నీరు వదిలేటట్టు చేశాం.

1962–67 మధ్యకాలంలో జిల్లాలో రైతు ఉద్యమంలో చేసిన కృషి కంతకూ కామ్రేడ్ వీరమాచనేని విమలాదేవి, ఎం.పి. గానూ, శాసనసభ్యులైన కామ్రేడ్ వంకా సత్యన్నారాయణ, సర్వేశ్వర్రావు, పడాల శ్యామ్‌సుందర్రావులు అన్ని సమస్యల్లో జిల్లాలోని రైతుసంఘ కార్యకర్తలకు చేదోడువాదోడుగా ఉంటూ అన్నివిధాలా తోడ్పడ్డారు.

బెల్లం ఉత్పత్తి రైతుల మీద ప్రభుత్వం రూపాయికి మూడుపైసల వంతున ఇదివరలో ఉపసంహరించుకొన్న దానిని తిరిగి విధించింది. ప్రభుత్వ అధికారులు నోటీసులు జారీచేసి గ్రామాల్లో రైతాంగంపై బడి నానా హంగామా చేస్తూ వసూళ్ళకు పూనుకొన్నారు. దానిమీద 7–3–68 వ తేదీన తణుకులో బెల్లం ఉత్పత్తి దారుల సభ జరిపి అసెంబ్లీ సమావేశం జరుగుచుండగా రాయబారం, ఆందోళన చేసిన ఫలితంగా ప్రభుత్వం దీనిని ఉపసంహరించుకున్నది.

పశ్చిమగోదావరి జిల్లా, కృష్ణా జిల్లాలలో ఎకరానికి రూ. 150లు, తూర్పు గోదావరి జిల్లాలలో ఎకరానికి రూ. 60లు,

గుంటూరు జిల్లాలో ఎకరానికి రూ. 90 లు చొప్పున డెల్టా ఆయకట్టుకు సంబంధించిన భూములకు "డ్రైనేజీ సెస్సు" విధించాలని ప్రభుత్వం చిత్తుచట్టం ప్రకటించింది. ఈ సెస్సు సాలుకు రూ.20లు చొప్పున 6 సంవత్సరాలు చెల్లించాలని చట్టంలో వ్రాశారు. ఈ చట్టానికి వ్యతిరేకంగా మన జిల్లాలో కాంగ్రెస్‌వారిని కలుపుకొని పెద్దఎత్తున ప్రచారం చేశాం. ఈ ఆందోళనలో సుప్రసిద్ధ కాంగ్రెస్‌వాది శ్రీ దంతులూరి రామరాజు, ముద్దంటి సత్యనారాయణరాజు, పుష్పాల రామమూర్తి మొదలగువారు చాలామంది కలసివచ్చారు. భీమవరం, ఏలూరు, నర్సాపురం, తణుకు, గూడెం తాలూకాలలో తాలూకా సదస్సులు జరిగాయి. భీమవరంలో అన్ని రాజకీయాభిప్రాయము గలవారితో పెద్దఎత్తున జిల్లా మహాసభ జరిగింది. ఈ సభలో రాష్ట్ర రైతుసంఘాలు నుండి శ్రీయుతులు వై.వి. కృష్ణారావు, పిల్లలమర్రి వెంకటేశ్వర్లు, సంకు అప్పారావు గార్లు పాల్గొన్నారు. శ్రీ దంతులూరి రామరాజు గారు అధ్యక్షులుగాను, శ్రీ సంకు అప్పారావు కార్యదర్శిగాను జిల్లా కమిటీ ఏర్పడింది. మూడు పంచాయతీసమితులు బిల్లు ఉపసంహరించుకోవాలని తీర్మానిస్తూ ప్రభుత్వానికి పంపించాయి. 10 వేల కరపత్రాలను 240 గ్రామాలలో పంపకం చేశాం. 240 గ్రామాల నుండి టెలిగ్రాంలు పంపాం. 240 గ్రామాలలో బిల్లుకు వ్యతిరేకంగా ప్రచారం చేశాం. ఈ కృషివలన ఎకరానికి రూ. 150 నుండి రూ. 125లకు ప్రభుత్వం డ్రైనేజీ సెస్సు తగ్గించింది. ఈ విషయాన్ని నాటిమంత్రి శ్రీ సిద్ధారెడ్డిగారు స్వయంగా చెప్పారు. ఈ బిల్లులకు వ్యతిరేకంగా హైకోర్టు, సుప్రీంకోర్టులలో రిట్సువేసి వాదించాం. కాని కోర్టులు కొట్టివేశాయి.

## భూ పోరాట కార్యక్రమం

1970 అఖిలభారత కిసాన్‌సభ, ఆలిండియా వ్యవసాయ కార్మిక సంగం అఖిలభారత కమ్యూనిస్టు పార్టీ పిలుపునందుకొని భూ ఆక్రమణ ఉద్యమంలో ఆగస్టు 10 వ తేదీన తాడేపల్లిగూడెంలో, వెయ్యిమందితోను, తణుకులో 15 వందల మందితోనూ, నర్సాపురంలో వెయ్యిమందితోనూ, భీమవరంలో 200 మందితోనూ, ఏలూరు తాలూకాలో 800 మందితోనూ జిల్లా అంతటా ప్రదర్శనలు చేసి ప్రభుత్వాధికారులకు కోర్కెలు అమలు జరపాలని మెమోరాండాలు యివ్వబడినాయి. జిల్లాలో కరపత్రాలు వేసి గ్రామాలలో ప్రచారం చేయడం జరిగింది. ఆగస్టు 15 వ తేదిన భూ ఆక్రమణ ఉద్యమాన్ని నిరోధించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 12 – 14 తేదీల మధ్య ఉద్యమానికి నాయకత్వం వహించే కామ్రేడ్స్ 14 మందిని ఏలూరు, తణుకు, పోలవరం, చింతలపూడి పట్టణంలో అరెస్టు చేసింది.

ఈ భూపోరాటం రెండు దశలలోను జిల్లాలోని అన్ని తాలూకాలలో పెద్దఎత్తున అరెస్టులు జరిగాయి. శిక్షలు కూడా వేశారు. ఈ జిల్లాలో రాష్ట్ర రైతు సంఘాధ్యక్షులు కామ్రేడ్ వై.వి. కృష్ణారావు, అరెస్టు అయిన 15 రోజులు జైలులో ఉన్నారు. కామ్రేడ్స్ యిందుకూరి, కోండ్రు, జల్లేపల్లి వెంకట్రాజు, షరీఫ్, సత్యనారాయణరెడ్డి, భూపతిరాజు సుబ్బరాజు, వంకా మొదలగు నాయకులతో కలిసి 800 లకు పైగా అరెస్టు అయ్యారు. భూ అక్రమణ ఉద్యమం పేద ప్రజానీకంలో గొప్ప ఉత్సాహాన్ని కలుగజేసింది.

## ప్రదేశ్ చెరకు ఉత్పత్తి దారుల సభ

ప్రదేశ్ రైతుసంఘ నిర్ణయం మేరకు ఆంధ్రప్రదేశ్ చెరకు ఉత్పత్తిదారుల సభ తాడేపల్లిగూడెంలో జరిపాం. నాల్గువేల కరపత్రాలు వేసి నాలుగురోజులు కారును తీసుకొని సభకు రావాలని 110 గ్రామాలలో ప్రచారం చేశాం. వందమంది సభకు వచ్చారు. యితర జిల్లాల నుండి రైతు ప్రతినిధులెవ్వరూ రాలేదు. ప్రదేశ్ రైతుసంఘం నుండి శ్రీయుతులు వై.వి. కృష్ణారావు, పిల్లలమర్రి వెంకటేశ్వర్లు, సంకు అప్పారావు సభకు హాజరయ్యారు.

1971లోనే విద్యుత్ రేటు యూనిట్‌కు 12 నుండి 15 పైసలకు మినిమం గ్యారంటీ రేటు హార్సుపవరుకు రూ.50 నుండి 70లకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు యిచ్చింది. దీనిమీద తాడేపల్లిగూడెం ఏరియాలో ఆందోళన చేసి 13 గ్రామాల నుండి రైతులను సమీకరించి తాడేపల్లిగూడెం ఏరియా విద్యుచ్ఛక్తి రైతుల సభ జరిపాం. 13 గ్రామాల నుండి టెలిగ్రాంలు పంపాం. రాష్ట్రం మొత్తం మీద రైతాంగం చేసిన ఆందోళన వలన విద్యుచ్ఛక్తి రేట్ల పెంపుదల ఉత్తర్వులను ప్రభుత్వం ఉపసంహరించుకొన్నది.

1970 నవంబర్, డిశంబర్ మాసాలలో 75 కేజీల ధాన్యం బస్తా రేటు రూ. 33, 34 మాత్రమే యున్నది. ధాన్యం కొనేవారు లేరు. కొన్నా రొక్కాం యిచ్చేవారు లేరు.

రైతులకు గిట్టుబాటు కాని ఈ తక్కువ రేటుకు వ్యతిరేకంగా జిల్లా రైతుసంఘం ప్రదేశ్ రైతుసంఘం సహకారంతో పనిచేసింది. ఆంధ్రప్రదేశ్ ధాన్యం ఉత్పత్తిదారుల సభ విజయవాడలో జరిగింది. ఆ సభకు జిల్లా నుండి ప్రతినిధులను పంపించాం. ఈ సభ సూచనల తరువాత ప్రభుత్వం ఫుడ్ మార్కెట్‌లోకి వచ్చి 75 కేజీల బస్తా రూ. 38.20లకు కొనుగోలు ఏజంట్లను ఏర్పాటు చేసింది. ధాన్యం కొన్నది.

ఈ జిల్లాలో వర్జీనియా పుగాకు ఉత్పత్తి కూడా ఒక ముఖ్యమైన పంటగా ఉంది. కొద్దికాలంగా వర్జీనియా రైతులకు గిట్టుబాటుగా ఉండటం లేదు. ఈ సమస్యమీద రెండు

సంవత్సరాలు కృషిచేయుట జరిగింది. కామ్రేడ్ దుగ్గిరాల గోపాలకృష్ణ ప్రత్యేకంగా కృషిచేసి కొవ్వూరు, పోలవరం తాలూకా రైతులను కదిలించి పనిచేశారు. అన్ని రాజకీయాభిప్రాయాలు కల రైతులను సమీకరించారు.

రైతులను కంపెనీలకు పొగాకు తోలకుండా కూడా ఆపుచేయించగలిగాం. కాని రైతులు నిలబడలేకపోయారు. చిన్నాయిగూడెంలో మొదట్లో ఒక సభ జరిగింది. తరువాత పెద్దయెత్తున కొయ్యలగూడెంలో ఒక సభ జరిగింది. జిల్లా వర్జీనియా పుగాకు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పడింది. దీనికి కార్యదర్శి కామ్రేడ్ దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, అధ్యక్షులు శ్రీ కె. జగన్నాధరావు ఈ సమస్యతో పట్టుదలతో గట్టిగా కృషి చేస్తున్నందుకు ఇ.యల్.టి.డి. కంపెనీ గోపాలకృష్ణను ఆర్థికంగా దెబ్బకొట్టింది.

ఎరువుల ధరలు పెరిగిపోయి బ్లాక్ మార్కెట్‌లో అమ్ముచున్నప్పుడు తాడేపల్లిగూడెం, తణుకులలో బ్లాక్ మార్కెట్‌ను రైతుసంఘ కార్యకర్తలు పట్టుకొన్నారు. గూడెంలో రైతులకు కంట్రోల్ రేట్లకు ఎరువులు అమ్మించినందున తాలూకా రైతాంగంలో గొప్ప ఉత్సాహాన్నిచ్చింది. పాలకొల్లు, చాగల్లు షుగర్ ఫ్యాక్టరీలకు పాతరేట్లకే ఎరువులు రావడం జరిగింది. కాని ఫ్యాక్టరీ వాళ్ళు కొత్తరేట్లకు ఆ ఎరువులు అమ్మటానికే ప్రయత్నించారు. ఆ ఫ్యాక్టరీల ఏరియాలలో యుండే రైతు కార్యకర్తలు మన లెజిస్లేచర్ల సహాయంతో ఆ ఎరువులను పాత రేట్లకే అమ్మించడం జరిగింది.

## జిల్లా విద్యుచ్ఛక్తి రైతుల మహాసభ

వ్యవసాయానికి రైతులుపయోగించే విద్యుత్‌రేట్లు 1972 ఆగస్టులో ప్రభుత్వం పెంచింది. ఈ పెంపుదలకు వ్యతిరేకంగా జిల్లా రైతుసంఘం ప్రభుత్వానికి కొన్నివందల టెలిగ్రాంలు పంపింది. తాలూకా సెంటరులోను, యితర సెంటర్‌లోను సభలు జరిపి వ్యతిరేకిస్తూ తీర్మానాలు చేయడం జరిగింది.

జిల్లా రైతుసంఘం అన్ని రాజకీయపార్టీలు తాడేపల్లిగూడెం తాలూకా నల్లజెర్లలో జిల్లా మహాసభ జరిపింది. సభకు రెండువేల మంది హాజరయ్యారు. జిల్లా విద్యుచ్ఛక్తి రైతులసంఘం ఏర్పడింది. ఈ సంఘానికి అధ్యక్షులు నల్లజర్ల పంచాయతీ సమితి అధ్యక్షులు శ్రీ కంఠమని శ్రీనివాసరావు, కార్యదర్శిగా కామ్రేడ్ కారుమూరి సత్యనారాయణరెడ్డి ఎన్నుకోబడ్డారు. ఈ సభ జరపడంలో జిల్లా రైతుసంఘంతో బాటు శ్రీకంఠమని శ్రీనివాసరావు, శ్రీ ఈలి ఆంజనేయులు, ఎం.ఎల్.ఎ. ప్రముఖ పాత్ర వహించారు. జిల్లా రైతుసంఘం తరపున కామ్రేడ్స్ సంకు అప్పారావు, యిందుకూరి సుబ్బరాజు, కారుమూరి సత్యనారాయణరెడ్డి మొదలగువారు గట్టిగా కృషిచేశారు. గ్రామాల నుండి 80 వేల సంతకాలు సేకరించి హైద్రాబాద్‌కు రాయబారం వెళ్ళి అప్పటి విద్యుచ్ఛక్తి మంత్రిణిగాయున్న శ్రీమతి జయప్రదగారిని విద్యుత్‌బోర్డు ఉద్యోగులను శాసనసభ్యులు శ్రీ కృష్ణ, వంకా, ఈలి ఆంజనేయులు మొదలగువారిని కూర్చోబెట్టి రైతులెదుర్కొంటున్న విద్యుచ్ఛక్తి సమస్యలు గూర్చి వివరంగా చర్చించడం జరిగిన తరువాత పెంచిన విద్యుత్‌రేట్లు డిశంబర్ వరకు నిలుపుదల చేస్తూ మినిమం గ్యారంటీని తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ శ్రీమతి జయప్రదగారు శాసనసభలో ప్రకటించారు. వీటిమీద యింకా నిర్మాణయుతమైన పనిచేసి పర్మనెంటు ఫలితాలు సాధించకుండ ఆంధ్రప్రదేశ్‌ను విడగొట్టాలనే ఉద్యమం వచ్చి రైతు ఉద్యమాన్ని దెబ్బకొట్టింది. శ్రీ శరీన్ అడ్వయిజరీ ప్రభుత్వం పెంచినరేట్లను తమకాలంలో వసూలు చేసింది. అందుచే ప్రత్యేక ఆంధ్ర ఉద్యమం వలన రైతాంగం గొప్ప నష్టానికి లోనయ్యారు.

పాలకొల్లు షుగర్ ఫ్యాక్టరీ కేన్‌గ్రోయర్స్ అసోసియేషన్‌లో యుండి కాంగ్రెస్ వారితో కలసి పనిచేస్తూ షుగర్ ఫ్యాక్టరీలో జరుగుతున్న అవినీతి, ఆశ్రిత పక్షపాతానికి వ్యతిరేకంగా పోరాడి జిల్లా రైతుసంఘ నాయకులు కామ్రేడ్ మన్యం వీటిమీద ప్రభుత్వ విచారణ జరిపించారు. దీనిమీద చెరకు రైతులలో మన రైతుసంఘ కార్యకర్తయైన మన్యంపై సదభిప్రాయం కలిగి ఆ సంఘానికి కార్యదర్శిగా ఎన్నుకొన్నారు. చాగల్లు షుగర్ ఫ్యాక్టరీకి సంబంధించి ఉత్పత్తిదారుల సంఘాలు రెండున్నాయి. ఈ రెండింటిలోను రైతుసంఘ కార్యకర్తలు పనిచేస్తున్నారు.

## గిరిజన సమస్య

మన జిల్లాలో గిరిజనరైతు సమస్య చాలా ముఖ్యమైనది. పోలవరం తాలూకాలో 40 వేలమంది గిరిజనులున్నారు. ప్రధానంగా వీరు "కోయ" జాతికి చెందినవారు. చిరకాలంగా ఈ గిరిజన రైతులు తమ భూములకు జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా గర్వించదగిన వీరోచితపోరాటాలు సాగించారు. అయినా వీరు చదువురాని అమాయకులు, నిరుపేదలు అగుటవలన అనేకమంది వీరిని మోసగించి అక్రమంగా అన్యాయంగా చట్టవిరుద్ధంగా వీరి భూములను కాజేసి పండించుకొంటున్నారు. కౌలుకని ఈ భూములలో ప్రవేశించిన గిరిజనేతరులు కోయలకు కౌలు యివ్వకుండా దౌర్జన్యంగా ప్రవర్తిస్తున్నారు. జిల్లా రైతుసంఘం ఈ గిరిజనులలో యించుమించు నాలుగు దశాబ్దాలుగా పనిచేస్తున్నది. ఇటీవల ముఖ్యంగా జిల్లెళ్ళగూడెం గ్రామంలో షావుకారులకు వ్యతిరేకంగాను తూటిగుంట గ్రామ ఏరియాలో

పోలవరం సమితి అధ్యక్షులు శ్రీ విశ్వనాథరెడ్డికి వ్యతిరేకంగాను గిరిజనుల కొరకు జిల్లా రైతుసంఘం పోరాడింది. విశ్వనాథరెడ్డి వర్గం ఒక గిరిజనరైతును కాల్చిచంపారు.

హుకుంపేట జమీందార్ చేతిలో కోయలభూమి 570 ఎకరాలు అట్టాగే ఉండిపోయింది.

గిరిజనులు తమ భూములు న్యాయంగా తమకు రావాలని 1970 తరువాత పిటిషనులు పెట్టగా 1973 సంవత్సరంలో కొవ్వూరు ఆర్.డి.వో. గారు 360 పిటిషన్‌దారులకు భూములు వారివేయని ఆర్డర్లు పంపించారు. వీనిమీద గిరిజనులలో గొప్ప ఉత్సాహం వచ్చింది. గిరిజనేతరుల నుండి ఈ భూములు గిరిజనులకిప్పించుటకు జిల్లా రైతుసంఘ నాయకులు శ్రీ జల్లేపల్లి వెంకట్రాజు, పోలవరం కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ యస్.జి. షరీఫ్ గార్లు గిరిజనులకు నాయకత్వం వహించారు. గిరిజనుల భూములు కాజేసిన గిరిజనేతర భూస్వాములు ఈ నాయకులను చంపించాలని ప్రయత్నాలు చేశారు. ఈ నాయకులు చాలా మెలకువగా ఆ ఘాతుకకృత్యాలకు బలికాకుండా తప్పుకున్నారు. ఇది తెలిసిన తరువాత ప్రదేశ్ రైతుసంఘం తరపున శ్రీ సంకు అప్పారావు జిల్లా రైతు సంఘం తరపున శ్రీ మారెళ్ళ నరసింహారావు వెళ్ళి పోలీసు అధికారులను కలిసి గిరిజనేతర భూస్వామ్యవర్గాల ఎత్తుగడలను వివరించడం జరిగింది. గిరిజన భూములను కాజేసిన భూస్వాములను హెచ్చరించటం జరిగింది. ఆ తరువాత కామ్రేడ్ సంకు అప్పారావు గారు కామ్రేడ్ షరీఫ్‌తో కలిసి సీతంపేట, జీలుగుమిల్లి, కన్నాపురం, జంగారెడ్డిగూడెంలలో బహిరంగసభలు జరిపి గిరిజనులను సమీకరించి అందరిని ఐక్యపరచటం జరిగింది. గిరిజనుల భూములు కాజేసిన గిరిజనేతరులు కలిసి సమిష్టిగా చర్చించుకొని న్యాయంగా గిరిజనులకు రావలసిన భూములను విడిచిపెట్టాలనే దానికి గిరిజనేతర భూస్వాములు అంగీకరించారు. కాని జిల్లా కలెక్టర్ గిరిజనేతర భూస్వాములకు లొంగి మొదట యిచ్చిన ఆర్డరును తిరిగి విచారించమనడం జరిగింది. దీనితో గిరిజనేతర భూస్వాములు రాజీ చేసుకోకుండా వెనక్కుపోవడం జరిగింది. యిప్పటికి మూడేండ్లుగా ఈ సమస్య బహునెమ్మదిగా విచారణలోనే ఉన్నది. విచారణ జరిగిన కేసులలో కూడా గిరిజనులకు పూర్తిగా న్యాయం జరుగుట లేదు. ఈ విచారణకు బహుకొద్ది భూములు కోయలకు వచ్చాయి. గిరిజనేతరులు దౌర్జన్యంగా కాజేసిన భూములలో 25 ఎకరాల వరకు కోర్టు ప్రమేయం లేకుండా రైతుసంఘం గిరిజనులకిప్పించడం జరిగింది. అందుకే గిరిజనులు రైతుసంఘం ఎడల పూర్తి విశ్వాసంతో ఉన్నారు. 1973 డిశంబర్ 21న తాలూకా గిరిజన మహాసభ చాలా పెద్దఎత్తున జరిగింది. దానికి ప్రదేశ్ రైతుసంఘాధ్యక్షులు శ్రీ వై.వి. కృష్ణారావుగారిని ఆహ్వానించటం కూడా జరిగింది. కామ్రేడ్స్ సంకు అప్పారావు, వంకా సత్యనారాయణ ఎం.ఎల్.ఎ., ఇందుకూరి సుబ్బరాజు, యస్.జి. షరీఫ్ మొదలగు వారు ఉపన్యసించారు. కోయలందరూ యిప్పటికీ భూములు సంపాదించుకోవాలని గొప్ప పట్టుదలతో ఉన్నారు. శాసనసభ్యులు కామ్రేడ్ వంకా సత్యనారాయణ ఈ సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించడం జరిగింది. ఈ ఉద్యమాన్ని యింకా బలపరిచి, నిర్మాణయుతంగా జిల్లా రైతుసంఘం పనిచేయవలసియున్నది. కోయ భూములు కోయలకు దక్కేవరకు పట్టువిడుపులు లేని పోరాటం సాగించవలసియున్నది.

పైవిధంగా ఈ జిల్లాలో రైతుసంఘం 1930 నుండి నేటివరకు నిర్మాణయుతంగా పనిచేస్తూ వీరోచిత రైతాంగపోరాటాలు నడిపింది. రైతులు ఎదుర్కొనే ప్రతి ఒక సమస్యను సకాలంలో తీసుకొని రైతులకోసం కృషిచేయడం జరుగుతున్నది. అయితే రైతు సమస్యలు తీసుకొని పనిచేస్తున్న శ్రద్ధకు అనుగుణ్యంగా యిటీవల కాలంలో గ్రామ, తాలూకా, జిల్లా రైతుసంఘాల నిర్మాణం లేదు. సిరిసిల్లా, అర్లగడ్డ, ఖమ్మంలలో జరిగిన రాష్ట్ర రైతు మహాసభలకు, బారాసత్, బట్టిండాలో జరిగిన అఖిలభారత రైతు మహాసభలకు జిల్లా నుండి ప్రతినిధులు వెళ్లడం జరిగింది. కాని చాలాకాలంగా జిల్లా రైతు మహాసభను జరపాలనుకుంటూ యింతవరకూ జరపటం జరగలేదు. అధ్యక్ష కార్యదర్శులు కార్యవర్గంతో కూడిన జిల్లా రైతుసంఘం యున్నమాట వాస్తవం. 1966 నుండి దీనిని జిల్లా రైతుసంఘం సదస్సులలో ఎన్నుకోవటం తప్ప యింతవరకు జిల్లా రైతు మహాసభలు జరగలేదు. అట్లాగే భీమవరం, తాడేపల్లిగూడెం, ఏలూరు మొదలగు తాలూకాలలో తాలూకా రైతుసంఘాలున్నాయి. కాని యివి కూడా నిర్మాణయుతం గాను పటిష్టవంతంగాను లేవు. 1975లో జిల్లాలో 9 వేలు రైతుసంఘ సభ్యత్వం చేరింది. 1976కి 17,500 సభ్యత్వం చేర్పించాలని వివిధ తాలూకాలలోని రైతుసంఘాలు, రైతుసంఘ కార్యకర్తలు, కోటాలు తీసుకున్నారు. రాష్ట్ర రైతుసంఘం నడుపుచున్న 'రైతులోకం' అనే పత్రికకు 500 చేర్చాలని కోటా తీసుకున్నారు. వీటిని పూర్తిచేసి జిల్లా రైతుమహాసభ జరిపి జిల్లా సంఘాన్ని పటిష్టంగాను నిర్మాణయుతంగాను నడపాలని జిల్లా సంఘం నిర్ణయించుకుంది. ఇవి తప్పకుండా జయప్రదమయ్యే సూచనలున్నాయి. ❑

# బెల్లం రైతుల దుస్థితి

స్వీయ రచనలు

- సంకు అప్పారావు




ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళం, విశాఖ, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు, కృష్ణా, చిత్తూరు, అనంతపురం, నిజామాబాద్, మెదక్ జిల్లాలలో ప్రధానంగా బెల్లం ఉత్పత్తి జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 3 లక్షల ఎకరాలలో చెరకు పండుతోంది. దీనిలో నాలుగో వంతు మాత్రమే పంచదార ఫ్యాక్టరీలు, ఖండసారీ ఫ్యాక్టరీలు ఆడి పంచదార తయారు చేస్తున్నాయి. మిగతా చెరకు బెల్లం తయారీకి ఉపయోగించబడుతుంది.

### మార్కెట్ ఒడుదుడుకులు

బెల్లం మార్కెట్ తరచు ఒడిదుడుకులకు లోనవుతోంది. ఒకప్పుడు ధరలు అమాంతంగా పెరుగుతాయి. మరొకప్పుడు పూర్తిగా పడిపోతాయి. ఈ ఒడిదుడుకుల వల్ల రైతాంగము, చిన్న వర్తకులు ఆర్థికంగా నలిగిపోతున్నారు. రెండేళ్లలో బెల్లం ధరలు పెరిగి రైతుకు లాభదాయకంగా వున్నాయి. 1987లో క్వింటాలు బెల్లం ధర రూ.180 నుంచి రూ.200 వరకు వుంది. 1988లో రూ.150 నుంచి రూ.200 వరకు వుంది. కాని ఈ ఏడాది రూ.100 నుంచి రూ.120 ప్రారంభించి ఇప్పుడు రూ.50 నుంచి రూ.70 వరకు వుంది. తాడేపల్లిగూడెం మార్కెట్‌లో మూడు మళ్ళ బుట్ట బెల్లం గత ఏడాది రూ.40 వరకు అమ్మింది. ఈనాడు అది రూ.16 రూపాయలు మాత్రమే ఉంది.

బెల్లం ధర బాగా వున్నప్పుడు గత ఏడాది పంచదార ఫ్యాక్టరీల వారు టన్ను ఒక్కంటికి రూ.110 రూపాయలు చెల్లించారు. ఖండసారీ ఫ్యాక్టరీలు రూ.150 వరకు చెల్లించాయి. కాని, ఈ ఏడాది బెలం ధర తగ్గడం చెరకు ఏరియా బాగా పెరగడం వల్ల టన్ను ఒక్కంటికి 100 కన్నా హెచ్చు ఇవ్వనిరాకరించారు. ఖండసారీ ఫ్యాక్టరీలు ఈనాడు టన్ను ఒక్కంటికి రూ.50 మాత్రమే ఇస్తున్నాయి. రైతులు అయినకాడికి చెరకును వదలించుకొంటున్నారు.

క్రింది ఉత్పత్తి ఖర్చులను పరిశీలిస్తే బెల్లం ఉత్పత్తిదారు దుస్థితి బోధపడుతుంది. ఒక ఎకరంలో చెరకు పండించి



## బెల్లంఉత్పత్తిదారుల 'లైసెన్సింగ్' ఉపసంహారణకై డిమాండ్

### పశ్చిమగోదావరి జిల్లా బెల్లం ఉత్పత్తిదారుల మహాసభ తీర్మానం

బెల్లం ఉత్పత్తి చేసేందుకు అయ్యే ఖర్చులు (పెట్టుబడులు) ప్రాంతాలను బట్టి కొద్దిగా తేడాలు ఉంటాయి. పశ్చిమగోదావరి జిల్లాలో ఆయా ప్రాంతాలలోని లెక్కలు సేకరించి, అందులో కష్టపడి తక్కువ ఖర్చులతో ఉత్పత్తి చేసే లెక్కలు ఈ దిగువనిస్తున్నాము.

| | రూ. పై |
|---|---|
| దుక్కి, సాళ్లు, వగై రా | 80.00 |
| విత్తనం | 250.00 |
| విత్తనం, రవాణా, పాతడం వగైరా | 100.00 |
| కలుపు | 100.00 |
| ఎరువులు | 300.00 |
| రెండు పర్యాయములు చుట్లు | |
| రెండు పర్యాయములు బడలు | 100.00 |
| మొత్తం | 930–00 |

చెరుకు తయారయిన తరువాత చెరకు నరికి, రసం తీసి, బెల్లంగా వండుటకు అందులోవేసే హైడ్రోస్, సున్నం వగైరాలకు, బుట్టలకు, కలిపి ఒకపుట్టి (ఇరవై మణుగులు) బెల్లం తయారగుటకయ్యే ఖర్చులు రూ.80 అవుతాయి. ఎకరానికి మూడేళ్లలో సగటున సంవత్సరానికి 15 పుట్ల బెల్లం తయారగును. అందుచే 80 ఇంటూ రూ.15= 1200.00/లు.

| | |
|---|---|
| చేసు (పైరు) తయారగుటకయ్యే ఖర్చులు | 930.00 |
| బెలం పంటకు | 1200 00 |
| ఎకరానికి పన్ను | 50.00 |
| మొత్తం ఖర్చులు | 2180.00 |

బావులలో నీరు తోడి చెరకు పండించే రైతుకు ఎకరానికి అదనంగా రూ.200/లు ఖర్చు కాగలదు. ఈ మధ్య క్రూడాయిల్ పీపా రూ.75/ల నుండి రూ.160/లకు పెరిగింది. ఈ రకం ఖర్చులు వేయకుండా డెల్టా భూములలో నీరు తోడడానికి ఖర్చులు లేని చెరకు ఉత్పత్తి ఖర్చులే యిస్తున్నాం.

తాడేపల్లిగూడెం బెల్లం మార్కెట్టు ఆంధ్రప్రదేశ్‌లో ప్రధానమైనది. సంవత్సరానికి ఎనిమిది మాసములు వారానికి సగటున 25,000 క్వింటాళ్లు బెల్లం మార్కెట్‌కు వస్తుంది.

తాడేపల్లిగూడెంలో బెల్లం కట్టల రూపంలో అమ్ముతారు. కట్ట బెల్లం అనగా మూడు మళ్ళు. "ఒక పుట్టికి 7 కట్టలు. ఈ పద్ధతిని తాడేపల్లిగూడెంలో చెలామణి చేస్తారు. అనేక జిల్లాలకు, ఇతర రాష్ట్రాలకు ఎక్కడ నుండి బెల్లం ఎగుమతి అగుచున్నది.

గత ఆదివారం (20–4–69) తాడేపల్లిగూడెంలో కట్ట బెల్లం సగటున రూ.20లు అమ్మింది. సాధారణంగా బెల్లం మొదటి రకం. రెండో రకం, మూడో రకం అని మూడు" రకాలుగా ఉంటుంది. కట్ట రూ.17 నుంచి రూ.27 వరకు అమ్మింది. ఇందులో మొదటి రకం తక్కువగా ఉంటుంది. క్రింది రెండు రకాలు హెచ్చుగా ఉంటాయి. అందుచే సగటున కట్ట రూ.20/ అని వర్తకులు చెప్పారు.

ఏడు కట్టలు ఒక పుట్టి కాబట్టి ఈ ధర ప్రకారం 20 ఇంటూ రూ.7= రూ.140/ లు పుట్టి బెల్లం ఖరీదు అయింది. ఎకరానికి 15 పుట్ల బెల్లం తయారవుతుందని పైన వివరించాం. అందుచే 15 పుట్లు బెల్లం అమ్మితే 140 ఇంటూ రూ.2100 రైతుకు ఆదాయం వస్తుంది. ఎకరానికి నీరు తోడకుండా డెల్టా భూములలో అయ్యే ఖర్చులపైన వివరించినట్లు ఎకరానికి రూ.2180 అగుచున్నది. ఒక్కొక్క వారం కట్ట బెల్లం రూ.15/– లకు కూడా అమ్మచున్నదంటే బెల్లం రైతుల పరిస్థితి ఎట్లా ఉంటుందో ఊహించలేం. ఇదిగాక పైన వివరించిన ప్రకారమే ఎకరానికి నికరమైన నష్టం నూరు రూపాయలున్నవి. స్వంత భూమి కలిగియున్న రైతు వ్యవసాయం చేస్తే అతనికి ధాన్యం పంటవలన రావలసిన ఆదాయం రాక పోగా ఎకరాన్కి నూరు రూపాయలు నష్టం వస్తుంది. బెల్లం ఉత్పత్తి దారులలో కవులుదార్లు కూడా వున్నారు. గత ఏడాది బెల్లం ధరలు రైతుకు అనుకూలంగా యుండుట వలన కవులు రేట్లు ఎకరానికి రు. 800/– నుండి రు.1200/– ల వరకు యున్నది. దీనిని బట్టి బెల్లం ఉత్పత్తి చేసే రైతు ఎంత కుంగిపోతాడో చెప్పలేం. పెట్టుబడి దారీ విధానంలోని ధరల అస్థిరత వలన రైతాంగం ఎటువంటి క్లిష్ట పరిస్థితులకు నెట్టబడుతున్నదో దీని వలన బోధపడుచున్నది. అందుచే కష్టపడి, సమాజానికి అవసరమైన సంపదను ఉత్పత్తి చేసే రైతు పంటకు గిట్టుబాటైన ధర ముట్టజెప్పే బాధ్యతను ప్రభుత్వం వహించాలి. నిలకడైన ధరను స్థిరమైన మార్కెట్టును ప్రభుత్వం గ్యారంటీ చేయాలి. బెల్లం ఉత్పత్తి చేసే రైతులను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలి.

1. కట్ట బెల్లం కనీస ధర రూ.35/–లుగా ప్రకటించాలి.
2. పైకనీస ధరకు ప్రభుత్వమే బెల్లం కొనుగోలు చేయాలి.
3. సరుకు నిల్వకు తగిన గోడౌను సౌకర్యాలు, సరుకు హామీపై అప్పు సౌకర్యం ప్రధానమైన మార్కెటు సెంటర్సు అన్నింటిలోను కల్పించాలి.
4. ఇతర దేశాలకు ఎగుమతి చేసే అవకాశాలను పరిశీలించాలి. స్థిరమైన మార్కెట్టును ఏర్పాటు చేయాలి. ❑

**(1969 ఏప్రిల్‌లో 'రైతు లోకం' పత్రికలో రాసిన వ్యాసం)**

# కమ్యూనిస్టు ఉద్యమంలో సంకు అప్పారావు

తణుకులో జరిగిన సమావేశం
కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ(1953)





పశ్చిమ గోదావరి జిల్లా కమ్యూనిస్టు పార్టీ కమిటీ సమావేశం 1952 నవంబరు 16వ తేదీన శృంగవృక్షంలో జరిగిన సందర్భంలోదీ  చిత్రం. కూర్చున్నవారు వరుసగా : అన్నె అనసూయ, అన్నె వెంకటేశ్వరరావు, నెక్కలపూడి రామారావు, ఉద్దరాజు రామం, గొట్టిముక్కల వెంకట్రామరాజు, సంకు అప్పారావు, కొటికలపూడి సూరన్న (ఆహ్వానితులు).
మొదటి వరుసలో నిలబడిన వారు : కుమ్మర కోటేశ్వరరావు, ఇందుకూరి సుబ్బరాజు, ....... గారపాటి సత్యనారాయణ, మైలవరపు రామారావు, చేకూరి నరసింహం, భూపతిరాజు లక్ష్మీ నరసింహారాజు, అల్లూరి సత్యనారాయణ, విరాట్‌రాజు,
వెనుక నిలబడినవారు : నేతల పోతురాజు, ఆకుల సుబ్బారావు, సత్యనారాయణరెడ్డి, ఎంవీఎన్ కపర్ది, కొల్లా వెంకటరత్నం, వంకా సత్యనారాయణ, యాళ్లబండి రంగనాయకులు